Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 220 విశాఖపట్నం, 14 జూన్ 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## హాస్టల్ వార్డెన్‌లకు కలెక్టర్ దిశా నిర్దేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకొని పని చేయాలని, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక సమయం కేటాయించి ఉత్తమ సేవలందించాలని సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున అన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాలని, వారిలో అన్ని రకాల నైపుణ్యాలు పెంపొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం మొదలైన క్రమంలో సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ పాఠశాలలు, వసతి గృహాల్లో కల్పించాల్సిన వసతులు, చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

సమావేశంలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల గురించి పీపీటీ ద్వారా వివరించారు. వసతి గృహాల్లో, పాఠశాలల్లో ప్రత్యేక వసతులు కల్పించామని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ చొరవతో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో గదులు, మరుగుదొడ్లు, భోజన శాలలు ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై, రూపొందించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థుల సౌకర్యార్థం ఇప్పటి వరకు చాలా అభివృద్ధి పనులు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. రూ.11 కోట్లతో 29 వసతి గృహాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. శాశ్వత తాగునీటి సదుపాయం ఉండేలా వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్లు పెడతామని, మరుగుదొడ్లలో గ్రీజర్లు అమర్చుతామని చెప్పారు. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ అందరికీ క్రీడా పరికరాలు అందిస్తామన్నారు. విశాఖ విద్యా వసతి వికాసం పేరుతో చేపట్టిన అన్ని పనుల గురించి సాధించిన ఫలితాల గురించి సమావేశంలో భాగంగా కలెక్టర్ వివరించారు. సీఎస్సార్ కింద దాతలు అందించిన సాయంతో చాలా పనులు చేశామని, భవిష్యత్తులో మరిన్ని పనులు చేపడతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారికి కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు యంత్రాంగం తరఫున కావాల్సిన తోడ్పాటు అందిస్తామని, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని, వంద శాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని హితవు పలికారు.

విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపాలని, స్వతహాగా వారి పనులు వారే చేసుకునేలా తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. క్రమశిక్షణ అలవడేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైక్రాటిస్టుల సహకారంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని, వారిలో మనోబలం నింపే ప్రయత్నం చేయాలని హితవు పలికారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని, విలువలు నేర్పాలని చెప్పారు. మంచి అలవాట్లు అలవడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయమే వ్యాయామం, యోగా చేసేలా, పత్రికలు చదివేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వారి ఆరోగ్యం ప్రత్యేక దృష్టి సారించాలని, మంచి పోషకాహారం అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఫోన్లు వినియోగించకుండా, సోషల్ మీడియా ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు అడ్వైజరీ బోర్డు మీటింగ్లు పెట్టాలని, అధికారులంతా సమన్వయంతో వెళ్లి ఉత్తమ సేవలందించాలని సూచించారు.

సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, డీఈవో చంద్రకళ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు



టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్ లో ఉన్న చాంబర్ లో ఈ సాయంత్రం 4.41 గంటలకు చంద్రబాబు సీఎంగా బాధ్యతలు అందుకున్నారు.

అనంతరం, ఎన్నికల్లో ఇచ్చిన ముఖ్యమైన హామీలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. చంద్రబాబు తన తొలి సంతకం. మెగా డీఎస్సీ ఫైలుపై చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై రెండో సంతకం చేశారు. పెన్షన్ ను రూ.4 వేలకు పెంచే ఫైలుపై మూడో సంతకం చేశారు. నాలుగో సంతకం... అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైలుపై చేశారు. ఐదో సంతకం... నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) ఫైలుపై చేశారు. కాగా, సీఎం చాంబర్ లో చంద్రబాబుకు టీడీపీ అగ్రనేతలు, అధికారులు, విద్యార్థినులు శుభా కాంక్షలు తెలిపారు. (మిగతా 2లో)

## వాసుదేవరెడ్డి బెయిల్ పిటిషన్ తిరస్కరించిన హైకోర్టు



**అమరావతి:** కీలక డాక్యుమెంట్లు మాయం చేశారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ ఎండీ, ఐఆర్‌టీఎస్ అధికారి డి.వాసుదేవరెడ్డిపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా.. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 18కి వాయిదా వేసింది. వాసుదేవరెడ్డికి మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని సీఐడీ తరపు న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. అనంతరం పిటిషన్‌పై విచారణను వాయిదా వేసిన కోర్టు.. ఈ లోపు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు నిరాకరించింది. (మిగతా 2లో)

## విమాన ప్రయాణీకులకు సులభ ప్రయాణ విధానాలు : రామ్మోహన్



కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా నియమితుడైన టీడీపీ యువ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇవాళ ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవన్ లో కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఈ బాధ్యత అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని చెప్పారు. కేంద్ర క్యాబినెట్ లో అత్యంత పిన్న వయస్కుడినైన తనపై బాధ్యతను మోపారని, ప్రధానికి యువతపై ఉన్న నమ్మకం దీని ద్వారా అర్థమవుతుందని అన్నారు.

100 రోజుల ప్రణాళిక తయారు చేసి, దాన్ని అమల్లోకి తీసుకువస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. టెక్నాలజీ వినియోగంతో పౌరవిమానయానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు.

సామాన్య ప్రయాణికుల కోసం ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్ పై దృష్టి పెడతామని, ఎయిర్ పోర్టుల నిర్మాణం వేగవంతం చేస్తామని వివరించారు. భోగాపురం ఎయిర్ పోర్టును త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. విజయవాడ, తిరుపతి ఎయిర్ పోర్టులకు కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అదే సమయంలో పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖను నిర్వహిస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. సమర్థ నాయకత్వం ఎలా ఉండాలి అనేది చంద్రబాబు నుంచి నేర్చుకున్నానని తెలిపారు.

2014లో పౌరవిమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అశోక్ గజపతిరాజు మంచి పునాదులు వేశారని వెల్లడించారు. ఉడాన్ స్కీమ్ కూడా అశోక్ గజపతిరాజు హయాంలోనే వచ్చిందని రామ్మోహన్ నాయుడు వివరించారు. అనుభవం కోసం జ్యోతిరాదిత్య సింధియా నుంచి కూడా కొంత సమాచారం (మిగతా 2లో)

## సియం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన యం.రవిచంద్ర



**అమరావతి, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా యం.రవిచంద్ర గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈమేరకు రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకులో ఆయన సియం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా వేదపండితులు అయనకు దివ్య ఆశిస్సులు అందించారు.అనంతరం పలువురు అధికారులు,సిబ్బంది రవిచంద్రకు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.తదుపరి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.టిఆర్అండ్బి ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, గుంటూరు జిల్లా కలక్టర్ యం.వేణు గోపాల్ రెడ్డి,ఎస్పి తుషార్ గూడి,న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకర్, ప్రోటోకాల్ డైరక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి,సచివాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యల పరిష్కార దిశగా ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రణాళికలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గురువారం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ కృష్ణ గార్డెన్స్ పార్టీ కార్యాలయంలో పలువురు పార్టీ నాయకులు , కార్యకర్తలు, ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వంశీకృష్ణ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువచ్చారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార మార్గం చూపించాలని తెలిపారు. దక్షిణ నియోజక వర్గంలో ముఖ్యమైనటువంటి కాలుష్య సమస్యను పరిష్కార దిశగా పలు అంశాలను అధికారులకు సూచించారు. కాలుష్యం పై కొన్ని అంశాలును అధికారులకు సూచిస్తూ ,ప్రణాళికాబద్ధంగా అమలు చేసి, శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులుకు , ఎస్ఈ శ్రీనివాస్ రాజుకి సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర అప్రమత్తంగా ఉండాలని అధికారులకు పార్టీ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గంలో అధికారులు ప్రజలు పార్టీ శ్రేణులు వంశీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## (మొదటి పేజీ తరువాయిలు)

### వాసుదేవరెడ్డి బెయిల్ పిటీషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి దస్త్రాలు, కంప్యూటర్ పరికరాలు, ఇతర పత్రాలను వాసుదేవరెడ్డి ఈ నెల 6న కారులో తరలిస్తుండగా చూశానంటూ.. కంచికచర్ల వాసి గద్దె శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై ఈ కేసు పెట్టింది. విలువైన ఆధారాలు, వస్తువుల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర తదితర అభియోగాలపై ఐపీసీ 427, 379 రెడ్‌విత్ 120బీ సెక్షన్ల కింద సీఐడీ కేసు నమోదు చేసింది.

### విమాన ప్రయాణీకులకు సులభ ప్రయాణ విధానాలు : రామ్మోహన్

తీసుకున్నానని వెల్లడించారు.

గత పథకాలను కొనసాగిస్తూ, మరిన్ని పథకాలు తీసుకువస్తామని చెప్పారు. విజనరీ నాయకులు మోదీ, చంద్రబాబు నుంచి చాలా నేర్చుకోవచ్చని అన్నారు. దేశ ప్రజలంతా గర్వించేలా పనిచేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు.

### ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు

చంద్రబాబు బాధ్య తలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా కూడా శుభాకాంక్షలు తెలిపారు.

మెగా డీఎస్సీలో భాగంగా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు 6,371... స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 7,725... టీజీటీ పోస్టులు 1,781... పీజీటీ పోస్టులు 286, మరికొన్ని ఇతర పోస్టులు ఉన్నాయి.

## వైజాగ్‌లో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని వీఎంఆర్‌డీఏ భవనంలో ఈ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆర్బీఐ అధికారులు భావిస్తున్నారు.

ఆ భవనంలోని ఐదో అంతస్తును కేటాయించా ల్సిందిగా జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఆర్బీఐ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ కోరారు.

కాగా ప్రతి రాష్ట్రంలో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఉంటుంది. దీంతో రాష్ట్రంలోనూ ఈ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు.

## ఈ నెల 16 న దాసాంజనేయ స్వామి తిరు కళ్యాణం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక పెద్ద బజారు లో కొలువై ఉన్న సువర్చలసహిత దాసాం జనేయ స్వామి తిరు కళ్యాణోత్సవం ను ఈ నెల 16 న నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారపర్య అర్చకులు వంశీ మోహనా చార్యులు తెలిపారు. స్థానికం గా గురువారం ఆయన మాట్లాడుతూ జ్యేష్ట శుద్ధ దశమి సందర్భం గా ఆలయం లో ఉదయం స్వామి వారికి పూజలు, అర్చనలు, అభిషేకములు నిర్వహించిన అనంతరం ఉదయం 10 గంటలకు స్వామి వారి తిరు కళ్యాణోత్సవం ను నిర్వహించనున్నామని కావున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తరించాలని ఆయన కోరారు.

## ఈ నెల 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోని ప్రజలకు రక్త విలువని తెలపాలనే ఉద్దేశంతో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఏటా జూన్ 14 న నిర్వహిస్తారు.

ప్రపంచ రక్త దాతల దినోత్సవ సందర్భంగా సర్వేజనా ఐక్య వేదిక అధర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు హెూటల్ విజయ రెసిడెన్సిలో శుక్రవారం నాడు ఉదయము 8 గంటలకు ప్రారంభమవుతుంది అని సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థా పకుడు కోరుబిల్లి పరి తెలిపారు ప్రతిరోజు మన చుట్టుపక్కల ఉన్న ఎంతోమంది గర్భిణీ స్త్రీలకు తల సేమియా వ్యాధిగ్రస్తు లకు హార్ట్ సర్జరీ ఆపరేషన్లకు యాక్సిడెంట్ కేసులకు నిత్యం వందలాది బ్లడ్ అవసరం అవుతుంది అయితే బ్లడ్ డొనేట్ చేసిన వాళ్ళు మాత్రం పదుల సంఖ్యలో మాత్రమే ఉంటున్నారు. దీనికి గల కారణం రక్తదాన పై సరైన అవగాహన లేకపోవడం ఒకటి మరొకటి ముఖ్యంగా రక్త దాతలకు ఇవ్వవలసిన ప్రాధాన్యత ఇవ్వలేకపోవడం రక్తదాత తను చేయవలసిన ఆరోజు కార్యక్రమాన్ని పక్కనపెట్టి తన విలువైన సమయాన్ని మరియు తన శరీరంలో ఉన్న రక్తాన్ని దానం చేసి ఓ ముగ్గురు ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వస్తున్న తరుణంలో కేవలం స్వచ్ఛంద సంస్థల నడిపిస్తున్నటువంటి నాలాంటి వారు మాత్రమే వారికి ప్రాధాన్య ఇస్తున్నారు తప్ప ప్రభుత్వం గానీ రాజకీయ నాయకులు గానీ వేరేవ్వరు కూడా వాళ్ళని గుర్తించలేకపోవడమే ప్రధాన కారణం. ప్రభుత్వం రక్తదాతలకు ప్రత్యేకమైన గుర్తింపు ఇచ్చి వారికి గుడిలోకి వెళ్ళినప్పుడు గాని హాస్పిటల్ కి వెళ్ళినప్పుడు గాని వేరే ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళినప్పుడు గాని వాళ్లకి ఒక పాస్ లాంటిది ప్రొవైడ్ చేసి సొసైటీలో గుర్తింపు ఇచ్చినట్లయితే వారిని చూసి ఇంకో పది మంది రక్త దానం చేయడానికి ముందుకు వస్తారు ఈ విషయమై ప్రభుత్వం గానీ నాయకులు గానీ మంచి ఆలోచన చేసి రక్త దాతలకు ప్రాధాన్యం ఇస్తారని తద్వారా చాలామంది ప్రాణాలు కాపాడుకోవడానికి దోహదపడుతుందని నా అభిప్రాయం కేవలం బ్లడ్ క్యాంప్ కండక్ట్ చేసే మాలాంటి వాళ్ళు మాత్రమే రక్తదాతల పుట్టినరోజులకు వివాహ వేడుకలకు కేక్ కటింగ్ లు చిరు సత్కారాలు చేసి ప్రోత్సహిస్తున్నాం మాకంటే ప్రభుత్వం గానీ నాయకులు గానీ అధికారులు గానీ వారికి గుర్తింపు ఇచ్చినట్లయితే తగిన ప్రాధాన్యత ఇచ్చినట్లయితే వారిని చూసి ఇంకొక పదిమంది ఇలాంటి రక్తదాన శిబిన కార్యక్రమాలకు ప్రోత్సాహం ఇస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడడానికి రక్తదానం చేయడానికి ముందుకు వస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా నిర్వాహకులుకోరిబిల్లీ పరి ఇంకుల మధు.పి దాసరి బాబు, పి. ప్రసాద్.పి. వెంకట్. కోయిలాడ నాగు.తులసి కుమార్ బి. వీరు నాయుడు కోరారు.

## మెగా డిఎస్‌సీపై ముఖ్యమంత్రి తొలి సంతకం - పునరుద్ధరించనున్న అన్నా క్యాంటిన్‌లు

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం సచివాలయం లో ముఖ్యమంత్రి హెూదాలో 5 ఫైల్ల పై సంతకం చేసారు. వీటిలో తొలి సంతకం మెగా డి ఎస్ సీ(16,347 పోస్టుల భర్తీ కి చర్యలు ), 2) ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, 3) పెన్షన్ 4వేల రూపాయిలకు పెంపు, 4) అన్నా క్యాంటిన్ ల పునరుద్ధరణ, 5) నైపుణ్యాభివృద్ధి సంస్థ ఫైల్ల పై ఆయన సంతకాలు చేశారు.

**సర్వత్రా హర్షం :** ఎన్నికలు సందర్భం గా తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో లో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి అయిన తరువాత చంద్రబాబు నాయుడు ఎన్నోఏళ్లుగా నిరుద్యోగ సమస్య తో బాధలు పడుతున్న డి ఎస్ సీ అభ్యర్థుల కల నెరవేర్చలా సుమారు 16,347 పోస్టులు భర్తీ చేయు నిమిత్తం మెగా డి ఎస్ సీ పై ముఖ్యమంత్రి తొలి సంతకం చేయడం తో డి ఎస్ సీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇక ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ ను 4 వేలకు పెంపు, ల్యాండ్ పూలింగ్ యాక్ట్ రద్దు, స్కిల్ డెవలప్మెంట్ ఫైల్ పై సంతకాలు చేయడం తో రైతులు, భూ హక్కు దారులు, పేద ప్రజలు, నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అభినందించారు.

## ఆంధ్రప్రదేశ్ ఆర్‌జిఐ ఏ విమాన యాత్రీకులు పుష్పక్ బస్ సేవలు పొందండి

### విమానాశ్రయం డిఎం బలదేవ్ కుమార్




**హైదరాబాద్, (ఆర్ఎన్ఐ):** హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని వివిధ ప్రాంతాలకు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ, అలాగే విమానాశ్రయ నుండి జంట నగరాల్లోని ఆయా ప్రాంతాలకు టి ఎస్ ఆర్ టి సి మొత్తం 389 పుష్పక్ ఏ సి ఎలక్ట్రికల్ బస్ సర్వీస్ లు 24గంటలు పాటు రాకపోకల సర్వీస్ లు నిర్వహిస్తూ విమాన ప్రయాణీకులకు అలాగే వెళ్లి వచ్చే వారికి స్వాగతం, వీడ్కోలు తెలిపేందుకు సౌకర్యార్థంగా నడుపుతున్నట్లు విమానాశ్రయం టి ఎస్ ఆర్ టి సి బస్సు డిపో మేనేజర్ (పుష్పక్ ఇంచార్జ్ ) బలదేవ్ కుమార్ ఈరోజు ఆర్ ఎన్ ఐ వార్త సంస్థ కు తెలిపారు.

ఈ మొత్తం సర్వీసుల నిర్వహణ వలన పైన పేర్కొన్న ప్రయాణీకులు వివిధ ప్రైవేట్ వాహనాలు అశ్రయించి పెద్ద మొత్తం ఖర్చు చెయ్యకుండా అతి తక్కువ ఖర్చుతో వెళ్లి రేయింబవళ్లు సౌకర్యవంతంగా ప్రయానించ వచ్చని అయన తెలిపారు. ఉదారహరణకు ఆంధ్ర ప్రదేశ్ తోపాటు తెలంగాణాకి చెందిన ఖమ్మం, సూర్యాపేట,తదితర జిల్లాలనుండి విమానాశ్రయానికి వెళ్ళేవారు ఎల్ బి చౌరస్తా లో దిగి 200గజాల దూరంలో వున్న పుష్పక్ పాయింట్ కి వెళితే (మొబైల్ నెం. 949286866149) ప్రతి పది నిమిషాలకు ఒక బస్ విమానాశ్రయము వరకు, అక్కడ నుండి ఎల్ బి నగరకు కేవలం ఒకవైపు 250 రు. టికెట్ తో పై ప్రాంతానికి చేరవచ్చు అని బలదేవ్ కుమార్ తెలిపారు. అలాగే ఏ ప్రాంతం వారైనా రైల్ల ద్వారా వచ్చి విమానాశ్రయం కి వెళ్లి రావల్సిన ప్రయాణీకులకోసం సికింద్రాబాద్ స్టేషన్ నుండి (వివరాలకు 9493763149) కూడా పుష్పక్ బస్ సర్వీస్ లు రేయింబవళ్ళు నడుస్థాయని తెలిపారు. 24x7 రోజులు నిర్వి రామంగా ఈ బస్ సర్వీస్ లు నడుస్థాయని వీటిని వినియోగించుకుని అధిక వ్యయం తగ్గించుకుని సౌకర్యవంతంగా రాజీవగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాక పోకలు సాగించుకుని అక్కడినుండి వారి వారి జిల్లాలకెళ్లే బస్ లు, అలాగే సికింద్రాబాద్ వెళ్లి రైళ్ళ ద్వారా సౌకర్యంగా ప్రయానించి డబ్బు ఆదాతో పాటు తమ సంస్థ కల్పించిన ఆధునిక పుష్పక్ బస్ ల ద్వారా రవాణా సౌకర్యం వినియోగించు కోవాలని రాజీవ్ గాంధీ అంతర్జీతీయ విమానాశ్రయం డిపో మేనేజర్ (పుష్పక్ బస్ ల విభాగం ) బలదేవ్ కుమార్ తెలిపారు.ముఖ్యంగా యావత్ ఆంధ్రప్రదేశ్ నుండి అలాగే తెలంగాణా జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట నల్గొండ తదితర జిల్లాల నుండి ఆర్టీసీ బస్సుల ద్వారా విమానాశ్రయం చేరే వారు ఎల్ బి నగర్ బస్ పాయింట్ నుండి,అలాగే వివిధ ప్రాంతాలనుండి రైళ్ళ ద్వారా వచ్చే వారు సికింద్రాబాద్ స్టేషన్ పుష్పక్ పాయింట్ నుండి వినియోగించుకోవాలని అయన కోరారు.

**పంచాంగం**

గురువారం 13-06-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, గ్రీష్మరుతువు
జ్యేష్ఠమాసం

| | |
|---|---|
| తిథి | : శు. అష్టమి రా. 10.53 |
| నక్షత్రం | : ఉత్తర పూర్తి |
| వర్జ్యం | : ప. 12.56 ల 02.46 |

## అన్నా క్యాంటిన్‌లకు మహర్దశ



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 183 అన్నా క్యాంటిన్ లను ప్రారభించిన విషయం విదితమే అన్నా క్యాంటిన్ల ద్వారా పేదలకు 5రూపాయిలు చొప్పున్న ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేసి చంద్రబాబు నిరుపేదల ఆకలిని తీర్చారు. అయితే 2019 లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్ అన్నా క్యాంటిన్ లను నిర్లక్ష్యం చేసి పేద ప్రజల పొట్ట మీద కొట్టారు. దీని పై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే 2024 ఎన్నికల సందర్భం గా తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు తాము అధికారం లోకి వస్తే తప్పకుండా అన్నా క్యాంటిన్ లను పునరుద్ధరించి పేద ప్రజలను ఆదుకొంటామని స్పష్టం చేయడం, తరువాత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాతబాధ్యతలను స్వీకరించిన తొలి రోజే (గురువారం) 5 ఫైల్ల పై సంతకాలు చేయడం, వాటిలో అన్నా క్యాంటిన్ ఫైల్ ఉండడం తో దినసరి కూలీలు,అట్టడుగు స్థాయి నిరుపేదలు, భవన నిర్మాణ కార్మికులు, చివరకు భిక్షగాళ్లు సైతం ఆనందం వ్యక్తం చేసి రాష్ట్రం లో మరలా మంచిరోజులు వచ్చాయని రోజా మూడు పూటలా తమకు ఆహారం దొరుకుతుందని సంబరపడి పోయి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలను తెలియజేస్తున్నారు.

**భీమిలి నియోజకవర్గం లో 4 అన్నా క్యాంటిన్‌లు:** 2014లో తెలుగుదేశం ప్రభుత్వం నియోజక వర్గం లో 4 అన్నా క్యాంటిన్ లు ఏర్పాటు చేసింది. ఇవి భీమిలి చిన్న బజారు, తగరపువలస అంబేద్కర్ కూడలి వద్ద ( పెట్రోల్ బ్యాంక్ ఎదురుగా), రెండు మధురవాడ ప్రాంతం లో ను ఏర్పాటు అయ్యాయి.

**తగరపువలస లో మరో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేయాలి:** నిత్యం రద్దీ గా ఉండే తగరపువలస లో నియోజకవర్గం నుండి వేలాది మంది రోజూ తగరపువలస కు వివిధ పనుల మీద వస్తూ వెళుతుంటారు. అయితే తగరపువలస లో గల ఒకే అన్నా క్యాంటన్ ద్వారా అందరికి ఆహారం అందుబాటులోకి రావడం లేదు.దీని దృష్ట్యా ప్రభుత్వం జోక్యం చేసుకొని తగరపువలస ప్రాంతం లోని మరో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని నిరుపేద ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఈ నెల 17 న లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కళ్యాణోత్సవం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక లక్ష్మీ నృసింహ క్షేత్రం( నరసింహస్వామి కొండ) పై కొలువై ఉన్న స్వామి ( సౌమ్యాచలాదీశుడు) వారి వార్షిక కళ్యాణోత్సవం ను ఈ నెల 17 న నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్యఅర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు తెలిపారు. స్థానికం గా గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి ని పురస్కరించికొని 17 వ తేదీన ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకములు, సాయంత్రం 6 గంటలకు ఆలయ కల్యాణ వేదిక వద్ద ఆగమ శాస్త్ర ప్రకారం స్వామి వారి వార్షిక కళ్యాణం జరిపించునున్నామని కావున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పునీతులు కావాలని ఆయన కోరారు.

## సెప్టెంబరు నెల ఆర్జిత సేవల టిక్కెట్లు 18నుండి 20 వరకు అందుబాటులో వుంటాయి

సెప్టెంబర్-2024 కోసం శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లు ఎలక్ట్రానిక్ DIP రిజిస్ట్రేషన్‌లు 18.06.2024 ఉదయం 10:00 నుండి అందుబాటులో ఉంటాయి. రిజిస్ట్రేషన్‌లు 18.06.2024 ఉదయం 10:00 నుండి 20.06.2024 ఉదయం 10:00 వరకు తెరిచి ఉంటాయి.

సెప్టెంబర్-2024కి సంబంధించిన కళ్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం మరియు సహస్ర దీపాలంకార సేవ వంటి సేవలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల కోటాను బుకింగ్ కోసం 21.06.2024 ఉదయం 10:00 కి అందుబాటులో ఉంటాయి.

ఆన్‌లైన్ సేవ (వర్చువల్ పార్టిసిపేషన్) మరియు సెప్టెంబరు- 2024లో శ్రీవారి ఆలయంలోని శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం & సహస్ర దీపాలంకార సేవాలకు అనుసంధానించబడిన దర్శన కోటా బుకింగ్ కోసం 21.06.2024 మధ్యాహ్నం 3:00కి అందుబాటులో ఉంటాయి.

సెప్టెంబర్-2024 తిరుమల అంగప్రదక్షిణం టోకెన్లు బుకింగ్ కోసం 22.06.2024 10:00 AMకి అందుబాటులో ఉంటాయి.

శ్రీవాణి ట్రస్ట్ దాతలకు సెప్టెంబర్ -2024లో దర్శనం మరియు వసతి కోటా బుకింగ్ కోసం 22.06.2024 ఉదయం 11:00 కి అందుబాటులో ఉంటాయి.

సెప్టెంబర్-2024 కోసం సీనియర్ సిటిజన్లు / శారీరకంగా సవాలు చేయబడిన కోటా బుకింగ్ కోసం 22.06.2024 మధ్యాహ్నం 3:00 కి అందుబాటులో ఉంటాయి.

సెప్టెంబర్-2024కి ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) టిక్కెట్లు బుకింగ్ కోసం 24.06.2024 ఉదయం 10:00 కి అందుబాటులో ఉంటాయి.

సెప్టెంబర్-2024లో తిరుమల మరియు తిరుపతి వసతి కోటా బుకింగ్ కోసం 24.06.2024 మధ్యాహ్నం 03:00 కి అందుబాటులో ఉంటాయి.

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుచానూరు ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ. 200/-) జూలై-2024 టిక్కెట్లు బుకింగ్ కోసం 24.06.2024 ఉదయం 10:00 కి అందుబాటులో ఉంటాయి.

టిటిడి - జూలై-2024 స్థానిక ఆలయాల సేవా కోటా బుకింగ్ కోసం 25.06.2024 ఉదయం 10:00 గంటలకు అందుబాటులో ఉంటాయి.

సప్తగో ప్రదక్షిణ శాలలో శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హెూమం, అలిపిరి జూలై 2024 నెల టిక్కెట్లు బుకింగ్ కోసం 25.06.2024 ఉదయం 10:00 గంటలకు అందుబాటులో ఉంటాయి.



# డయాబెటీస్, భుజం నొప్పికి సంబంధం ఏంటి?



భుజం గట్టిగా మారడం.. భుజాలు ఎముకలు, లిగమెంట్స్, లిగమెంట్స్ బంధన కణజాల గుళికలతో చుట్టబడి ఉంటాయి. భుజం కీలు చుట్టూ క్యాప్సూల్స్ చిక్కగా, బిగుతుగా ఉన్నప్పుడు అది కదలికలకి ఇబ్బందిగా మారుతుంది. ఈ పరిస్థితి సాధారణంగా మూడు స్టేజెస్‌లో ఉంటుంది. భుజం నొప్పి వస్తే ఏ పని చేసుకోలేరు. ఇబ్బందిగా అనిపిస్తుంది. చేతిని కదపలేరు.

ఇది ఆరు నుంచి తొమ్మిది నెలల మధ్య ఉంటుంది. ఈ స్టేజ్‌లో మీ భుజాన్ని కదల్చడానికి కూడా ఇబ్బందిగా ఉంటుంది. దీంతో మీరు చలన పరిధిని కోల్పోయినట్లుగా ఉంటారు.

**గట్టిగా మారడం..** ఇది నాలుగు నుండి పన్నెండు నెలల వరకు ఉంటుంది. ఈ సమయంలో నొప్పి మరింత ఎక్కువగా ఉంటుంది. కానీ, గట్టిగా మారే కొద్ది భుజాన్ని అస్సలు కదల్చలేరు.

**థావింగ్ స్టేజ్** : ఈ స్టేజ్‌లో మీరు కాస్తా చేతిని కదల్చుతారు. లక్షణాలు ప్రారంభమైన ఆరు నెలల నుండి చాలా సంవత్సరాల వరకూ పనులను తిరిగి చేసుకోవచ్చని గమనించొచ్చు. ప్రతి వ్యక్తికి గట్టిపడిన భుజంతో ఇబ్బందిగా ఉంటుంది. అయితే ముందు జాగ్రత్త తీసుకోవడం వల్ల తీవ్రత తగ్గుతుంది.

డయాబెటీస్ ఉన్నవారికి భుజం గట్టిగా మారడం అనేది ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వయసు ఎక్కువ ఉన్నవారు, డయాబెటీస్ వచ్చి చాలా రోజులైనా ఈ సమస్య వస్తే జాగ్రత్తగా ఉండాలి. అనియంత్రిత రక్తంలో చక్కెర స్థాయిలు మీ బంధన కణజాలాన్ని తయారు చేసే కీ ప్రోటీన్ కొల్లాజెన్‌ని మారుస్తాయి. కాబట్టి, షుగర్ ఉన్నవారికి భుజం గట్టిగా అయ్యే సమస్య ఎక్కువగా వస్తుంది. షుగర్ కొల్లాజెన్‌తో కలిసినప్పుడు, అది జిగటగా మారుతుంది. కదలికలు లేకుండా చేస్తుంది. దీంతో మీ భుజం గట్టిపడుతుంది. ఈ సమయంలో మీరు పనిచేయాలనుకున్నప్పుడు నొప్పిగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో అయితే భుజానం కదిలించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

**ఇతర సమస్యలు..** మీ భుజం చాలా కాలం పాటు కదలకుండా ఉంటే, భుజం గట్టిగా మారుతుంది. ఏదైనా గాయం అయినప్పుడు ఎలా ఉంటుందో.. అలా వ్యాధి ఉంటుంది. మగవారి కంటే స్త్రీలకి ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. 40, 60 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారికి ఇది ఎక్కువగా వస్తుంది.

**ఎలా పరీక్షిస్తారు.** భుజం గట్టిగా మారడం, లక్షణాల ద్వారే పరీక్షిస్తుంది. వైద్యులు మీ భుజాన్ని, దాని కదలికలని చూసి ఈ సమస్యని గుర్తిస్తారు.

దురదృష్టవశాత్తు, ఈ సమస్య రాదని చెప్పడానికి లేదు. రాకుండా ఉండాలంటే మీ బ్లడ్ షుగర్ వీలైనంత కంట్రోల్‌లో ఉంచుకోవాలి. దీంతో పాటు మీ భుజాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు ఎక్సర్‌సైజ్ చేయడం చాలా ముఖ్యం.

మీకు ఈ సమస్య రాక ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని మరిచిపోవద్దు.

**ట్రీట్‌మెంట్..** చాలామందికి ఫిజికల్ ట్రీట్‌మెంట్, నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వంట్ నాన్ ఆపరేటివ్ థెరపీలను ఎంచుకుంటారు.

కొందరు వ్యక్తులు కీళ్ళలో వచ్చే నొప్పిని తగ్గించేందుకు స్టెరాయిడ్ ఇంజెక్షన్స్ తీసుకుంటారు. మీకు షుగర్ ఉంటే ముందుగా వైద్యులని కలిసి మాట్లాడడం చాలా మంచిది. ఎందుకంటే ఈ ట్రీట్‌మెంట్ ప్రభావంగా ఉండాలి. లక్షణాలు తగ్గకపోతే ఓపెన్ క్యాప్సులర్ విడుదల, ఆర్థోస్కోపిక్ సర్జరీ వంటి విధానాలు తీసుకోవచ్చు.

భుజం గట్టిగా మారితే.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

షుగర్ ఉన్నవారికి భుజాలు గట్టిగా మారితే ఈ సమస్యని తగ్గించుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు.

సాధ్యమైనంతవరకూ రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్ ఉండేలా చూసుకోండి.

రోజూ ఎక్సర్‌సైజ్ చేయండి.

నొప్పిని తగ్గించేందుకు డాక్టర్ సలహా మేరకు మందులు వాడొచ్చు.

ఫిజికల్ థెరపిస్ట్ సాయంతో భుజం బలంగా మారేందుకు కొన్ని స్ట్రెచెస్ చేయొచ్చు.

మీరు ఏం చేయలేకపోతే సర్జరీ కూడా ఎంచుకోవచ్చు.

భుజానికి హ్యాండ్ బ్యాగ్స్ వేయడం ఆపేయండి. మీ చేతికి కాస్తా రెస్ట్ ఇవ్వండి.

భుజం గట్టిపడడం అనేది ఇబ్బందిగా ఉంటుంది. ఇది మీ పనులు చేయకుండా చేస్తుంది. అయితే దీనికి మంచి ట్రీట్‌మెంట్‌తో సమస్య తగ్గిపోతుంది.

# అరటిపండ్లు తింటే గుండెకి మంచిదా..

అరటి పండ్లు తినడం వల్ల తక్షణ శక్తి మనకి లభిస్తుంది. అదే విధంగా అరటి పండ్లు తినడం వల్ల కండరాలకు ఉపశమనం కూడా లభిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది కొనుగోలు చేసే పండ్లలో అరటి పండ్లు కూడా ఒకటి. చక్కటి పోషక పదార్థాలు అరటి పండ్ల ద్వారా మనం పొందొచ్చు. అరటి పండ్లలో మెగ్నీషియం, పొటాషియం, మాంగనీసు, ఫైబర్, ప్రోటీన్స్ మరియు ఇతర పోషకాలు ఉంటాయి.

**అరటి పండ్లతో బెనిఫిట్స్ ..**

కొత్తగా చేసిన స్టడీ ప్రకారం చూసుకున్నట్లయితే... గుండె సమస్యల బారిన పడకుండా ఉండాలంటే రోగులు పొటాషియం లెవల్స్ చెక్ చేయించుకోవాలి అని చెప్పారు డాక్టరు. అలాగే ఈ రీసెర్చ్ లో భాగంగా రీసెర్చర్లు తక్కువ పొటాషియం ఉండడం వల్ల ఈ సమస్యలు వస్తాయని గుర్తించారు. ఈ మధ్యకాలంలో ప్రతీ ఒక్కరు కూడా గుండె సమస్యలతో బాధ పడుతున్నారు. నిజానికి ఈ గుండె సమస్యలు బాగా ఎక్కువైపోయాయి. హృదయ సంబంధిత సమస్యల బారిన పడకుండా ఉండాలంటే వీలైనంత వరకు ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి.

సాధారణంగా హృదయ సంబంధిత సమస్యలు పొటాషియం లెవెల్స్ బట్టీ రావడం జరుగుతుంది. అయితే ఈ రీసెర్చ్‌లో ఎలుకలపై రీసెర్చ్ చేయగా పొటాషియం డైట్‌లో తక్కువగా ఉండటం వల్ల ఎరోటిక్ స్టిఫ్నెస్ లెవెల్స్ పెరిగాయని కనుగొన్నారు. తక్కువ పొటాషియం ఉండడం వల్ల arterial calcification మరియు aortic stiffness సమస్యలు కలుగుతాయని దీని ద్వారా తెలిసింది. డైట్‌లో పొటాషియం తగ్గితే అది ఎరోటిక్ స్టిఫ్‌నెస్ పెంచేస్తుంది.

ఇక అరటి పండ్ల వల్ల కలిగే ఇతర ప్రయోజనాలను కూడా మనం చూద్దాం. కేవలం ఇది మాత్రమే కాకుండా చాలా ప్రయోజనాలను అరటి పండు ద్వారా మనం పొందొచ్చు మరి వాటి కోసం కూడా మనం చూసేద్దాం.

**హార్ట్ ఎటాక్ రాకుండా..** కొత్త రీసెర్చ్ ప్రకారం చూస్తే.. అరటి పండ్లను రెగ్యులర్‌గా తింటే హార్ట్ స్ట్రోక్ మరియు హార్ట్ ఎటాక్ రాకుండా చేయొచ్చు. అరటి పండ్లు మరియు పొటాషియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల బ్లాకేజ్ వంటి సమస్యలు కలగవు. ఆర్టెరీస్ ఆరోగ్యంగా ఉంచడానికి ఇవి సహాయ పడతాయి. ఒక అరటిపండు 10 శాతం పొటాషియం అవసరాలను తీరుస్తుంది. స్టడీ ప్రకారం చూసుకున్నట్లయితే తక్కువ పొటాషియం ఉంటే 50 శాతం హార్ట్ స్ట్రోక్ రిస్కు పెరుగుతుంది.

ఎక్కువగా సాల్ట్‌ని ఉపయోగించడం వల్ల బిపి పెరుగుతుంది. అదే విధంగా హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి వాటికి కూడా ఇది కారణమవుతుంది. అలానే అరటి పండ్లను తీసుకోవడం వల్ల హార్ట్ ఎటాక్ మరియు స్ట్రోక్ వంటి సమస్యల రిస్క్ తగ్గుతుంది కాబట్టి మీరు రెగ్యులర్‌గా అరటి పండ్లను తీసుకోవడం మంచిది. అయితే పురుషులకంటే కూడా మహిళలు అరటి పండ్లు తీసుకోవడం వల్ల చక్కటి ప్రయోజనం పొందవచ్చు అని స్టడీ చెపుతోంది. ఏది ఏమైనా ఆరోగ్య నిపుణులు సాల్ట్‌ని తగ్గించమని చెబుతున్నారు. ఇక ఇది ఇలా ఉంటే అరటి పండులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది దీంతో యూరిన్ ద్వారా సోడియం బయటికి వస్తుంది.

**జీర్ణ సమస్యలు దూరం..** అరటి పండ్లను తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది అరటి పండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది అలానే నీటి శాతం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ రెండు అరటిపండ్లలో ఎక్కువగా ఉండడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఒక మీడియం సైజు అరటి పండు తీసుకుంటే మనకి రోజులో కావాల్సినంత ఫైబర్ 10 శాతం అందుతుంది. ఎక్కువ ఫైబర్ ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఇన్ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ తగ్గుతుందని స్టడీ చెబుతోంది. అలానే అరటి పండ్లను తీసుకోవడం వల్ల గ్యాస్, బ్లోటింగ్ వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అల్సర్‌ని కూడా అరటి పండు తొలగిస్తుంది. అల్సర్‌తో బాధపడే వాళ్ళు అరటి పండ్లను తినొచ్చు పైగా అరటి పండ్లను తినడం వల్ల అల్సర్‌కి కారణమైన యాసిడ్ల ఉత్పత్తి అవ్వకుండా అడ్డుకుంటుంది అరటిపండు.

**డయాబెటిస్ రాకుండా..** అరటి పండ్లను తీసుకోవడం వల్ల డయాబెటిస్ రాకుండా కూడా ఉంటుంది ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక తీసుకుంటే బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గుతాయి. అలాగే అధిక ఫైబర్ ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ రాకుండా ఉండొచ్చు. డయాబెటిస్ ఉన్న వాళ్ళు మాత్రం మోడరేషన్‌లో మాత్రమే అరటి పండ్లను తీసుకోవాలి గుర్తుంచుకోండి.

**బీపీ కంట్రోల్..** అరటి పండ్లు తినడం వల్ల వీటిని కూడా కంట్రోల్లో ఉంచుకోవచ్చు. చాలా మంది ఈ సమస్యతో బాధ పడుతున్నారు అటువంటి వాళ్ళు ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే తప్పకుండా అరటి పండ్లను తినాలి. పొటాషియం ఇందులో ఎక్కువగా ఉంటుంది కనుక మీకు సహాయం చేస్తుంది. పొటాషియం సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల కార్డియో వాస్క్యులర్ సమస్యలను తగ్గిస్తుంది. తద్వారా బీపీ కంట్రోల్లో ఉంటుంది.

అదే విధంగా హై బీపీ సమస్యతో బాధ పడే వాళ్ళు ఉప్పుని తగ్గించడం మంచిది సాల్ట్ ఎక్కువ ఉండే ఆహార పదార్థాలను తీసుకోకపోవడం వల్ల అద్భుతమైన లాభాలను మీరు పొందొచ్చు. బీపీ కూడా కంట్రోల్లో ఉంటుంది. ఒక మీడియం సైజు అరటి పండులో రోజుకి అవసరం అయ్యేంత పొటాషియమ్‌లో 10 శాతం మీకు అందుతుంది. కాబట్టి తప్పకుండా రెగ్యులర్‌గా ఒక అరటి పండును తీసుకోండి. అరటి పండ్లని మనం రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల బ్లడ్ ప్రెషర్ తగ్గుతుంది. కాన్సర్ మరియు హార్ట్ ఎటాక్ రిస్క్ కూడా తగ్గుతుంది. ఇక ఇది ఇలా ఉంటే పొటాషియం అధిక శాతంలో అరటి



పండ్ల లో ఉంటుంది. నిజానికి ఒక అరటి పండ్ల లో 455 మిల్లీ గ్రాముల పొటాషియం ఉంటుంది. మన గుండె ఆరోగ్యం పొటాషియంపై ఆధారపడి ఉంటుంది. పొటాషియం ఏం చేస్తుందంటే ఆర్టెరీస్ బాగా పని చేసేలా చేస్తుంది. అలానే న్యూరాన్స్, మజిల్స్‌కి పోషక పదార్థాలను పంపిస్తుంది. కిడ్నీలలో బ్లడ్ ఫిల్టరేషన్ అవ్వడానికి కూడా ఇది సహాయం చేస్తుంది.

**క్యాన్సర్ రిస్క్ దూరం..** క్యాన్సర్ రిస్క్ తగ్గడానికి కూడా అరటి పండు సహాయం చేస్తుంది అలానే రక్తహీనత సమస్యతో బాధ పడే వాళ్ళు అరటి పండు తీసుకుంటే ఈ రక్తహీనత సమస్య తగ్గుతుంది. అంతేకాకుండా, డిప్రెషన్ సమస్యతో బాధపడే వాళ్ళు అరటిపండ్లు తింటే డిప్రెషన్ నుండి బయటపడవచ్చు. అలాగే ఒత్తిడి కూడా ఉండదు. ఈ మధ్యకాలంలో చాలా మంది ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు. నిజానికి ఆఫీస్‌లో పని వల్ల ఇంట్లో పనుల వల్ల ఎంతో ఒత్తిడి కి చాలా మంది గురవుతున్నారు. అటువంటప్పుడు అరటి పండ్లు తింటే ఒత్తిడి నుండి బయట పడడానికి అవుతుంది. అరటి పండ్లను తీసుకోవడం వల్ల జ్ఞాపక శక్తిని కూడా పెంచుకోవచ్చు. కనుక జ్ఞాపక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు రెగ్యులర్‌గా అరటి పండ్లు తీసుకోవడం మంచిది అదే విధంగా అరటి పండ్లను తీసుకోవడం వల్ల మూడ్ రెగ్యులేట్ అవుతుంది.

**గర్భిణీలకు ఉపయోకరం..** అరటి పండ్లను తినడం వల్ల గర్భిణీలు కూడా ఎంతో ప్రయోజనం పొందవచ్చు. అరటి పండ్లలో ఉండే విటమిన్ బీ6 గర్భిణీలకు ఎంతో ప్రయోజనం కల్పిస్తుంది. అలానే పీఎంఎస్ సమస్యను తొలగించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. అలానే అరటి పండ్లని ఆరోగ్యానికి మాత్రమే కాకుండా అందానికి కూడా ఉపయోగిస్తారు. చాలా మంది ఫేస్ ప్యాక్ కింద కూడా వాడుతూ ఉంటారు. ఇలా కూడా అరటి పండు మనకి ఉపయోగ పడుతుంది.

చూశారు కదా.. అరటి పండ్ల వల్ల ఎంత ప్రయోజనమో అని... కాబట్టి రోజుకొక ఆపిల్ తినడం ఎంత ముఖ్యమో అరటి పండు తినడం కూడా అంతే ముఖ్యం కాబట్టి తప్పని సరిగా అరటి పండుని ఏదో ఒక రూపంలో మీ డైట్‌లో చేర్చుకొని సమస్యల నుంచి బయటపడొచ్చు. తద్వారా సమస్యలేమీ లేకుండా ఆరోగ్యంగా ఉండడానికి అవుతుంది.

# రోజూ ఓ స్పూన్ నెయ్యి తీసుకుంటే శరీరంలో వచ్చే మార్పులివే



మంచి ఆహారమే.. మంచి ఆరోగ్యం అని చెప్పొచ్చు. ఆరోగ్యంగా ఉండడంలో నెయ్యి కీ రోల్ పోషిస్తుంది. ఇందులో భాగంగా వర్షాకాలంలో హెల్త్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మంచి ఆహారం తీసుకోవాలి. ఈ సీజన్‌లో ఎక్కుగా ఆరోగ్య సమస్యలు వస్తాయి. వాటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే మన ఇమ్యూనిటీ బలంగా ఉండాలి. దాని కోసం ఇమ్యూనిటీని పెంచే నెయ్యి తీసుకోవాలి. నిజానికీ ఈ టైమ్‌లో రోజుకో స్పూన్ నెయ్యి తింటే చాలా సమస్యలు దూరమవుతాయి.

**ఇమ్యూనిటీ..** నెయ్యి తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. నెయ్యిలో కొవ్వులో కరిగే విటమిన్స్ డి, కె, ఇ, ఎలు ఉన్నాయి. నెయ్యిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇది ఇతర ఆహార పదార్థాల నుండి పోషకాలను గ్రహించడంలో సాయం చేస్తుంది. ఇవన్నీ ఇమ్యూనిటీని పెంచుతాయి. వర్షాకాలంలో వ్యాధులు సర్వసాధారణం. నెయ్యి తీసుకుంటే వాటి నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

**జీర్ణ సమస్యలు..** అదే విధంగా, ఈ టైమ్‌లో జీర్ణ సమస్యలు కూడా ఉంటాయి. గ్యాస్ అసిడిటీ సమస్యలకి నెయ్యి ఔషధం. ఇందులో బ్యూట్రిక్ యాసిడ్ ఉంటుంది. పెద్దప్రేగు కణాలు తమకి ఇష్టమైన శక్తి వనరుగా బ్యూట్రిక్ యాసిడ్‌ని వాడతాయి. ఉదయమే ఓ గ్లాసు గోరువెచ్చని నీటిలో ఓ టీస్పూన్ నెయ్యి కలిపి తీసుకుంటే మలబద్ధకం నుండి రిలాక్స్ అయి జీర్ణక్రియ మెరుగ్గా అవుతుంది.

**జుట్టు, చర్మానికి..** నెయ్యి చర్మం, జుట్టుకి చాలా మంచిది. వర్షాకాలంలో ఇది కూడా అవసరమే. జ్ఞాపకశక్తిని పెంచేందుకు హెల్ప్ అవుతుంది. దీనిని తీసుకోవడం వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుంది.

**బరువు తగ్గడం..** నెయ్యిలో మంచి ఫ్యాట్స్ ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారు. దీనిని తీసుకున్న తర్వాత జీర్ణక్రియ బలంగా మారుతుంది. అతిగా తినకుండా కూడా ఉంటారు.

# జీలకర్రతో నిమ్మకాయ, కరివేపాకు, ధనియా నీళ్లు తాగితే..



అధునిక పోటీ ప్రపంచంలో ఎక్కడ చూసినా ప్రధానంగా కన్పించే సమస్య అధిక బరువు. బరువు తగ్గించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ జీలకర్రతో అద్భుతంగా బరువు తగ్గించవచ్చని చాలా తక్కువమందికి తెలుసు.

భారతీయుల ప్రతి కిచెన్‌లో తప్పకుండా ఉంటుంది జీలకర్ర ఆహార పదార్థాల రుచి పెంచేందుకు జీలకర్ర వినియోగించడం అలవాటే. అయితే జీలకర్ర ఆరోగ్యానికి చాలా మంచిది కూడా. ఇందులో ఉండే మెగ్నీషియం, ఐరన్, కాల్షియం, విటమిన్లు, ఫైబర్, పొటాషియం ఆరోగ్యానికి చాలా మేలు చేకూరుస్తాయి. ఎన్నో రకాల అనారోగ్య సమస్యల్నించి ఉపశమనం కల్గిస్తాయి. జీలకర్ర తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుంది. ఇక అన్నింటికంటే ముఖ్యమైంది అధిక బరువు సమస్య. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు జీలకర్ర అద్భుతంగా పనిచేస్తుందంటున్నారు ఆయుర్వే వైద్య నిపుణులు.

**జీలకర్ర-కరివేపాకు నీళ్లు** : జీలకర్ర, కరివేపాకు నీళ్లతో బరువు సులభంగా తగ్గించుకోవచ్చు. దీనికోసం రాత్రి నిద్రపోయేముందు ఒక గ్లాసు నీళ్లలో ఒక స్పూన్ జీలకర్ర, కొన్ని కరివేపాకు ఆకులు వేసి ఉంచాలి. ఉదయం ఈ నీటిని కాచి తాగాలి. ఈ మిశ్రమాన్ని రోజూ క్రమం తప్పకుండా తాగడం వల్ల శరీరం మెటబోలిజం వృద్ధి చెందుతుంది. దాంతోపాటు బరువు గణనీయంగా తగ్గుతారు.

**జీలకర్ర-ధనియా నీళ్లు** : జీలకర్ర, ధనియాలు రెండింటితోనూ అధిక బరువు తగ్గించుకోవచ్చు. బరువు తగ్గేందుకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధనియా-జీలకర్ర నీళ్లను తాగాల్సి ఉంటుంది. రాత్రి కొద్దిగా జీలకర్ర, ధనియాలను నీళ్లలో వేసి ఉంచాలి. ఉదయం ఆ నీళ్లను పరగడుపున తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది.

**జీలకర్ర నిమ్మకాయ నీళ్లు** : నిమ్మకాయతో కూడా బరువు తగ్గించుకోవచ్చంటున్నారు. దీనికోసం రాత్రి పూట రెండు స్పూన్ల జీలకర్రను గ్లాసు నీటిలో వేసి ఉంచాలి. ఉదయం ఈ నీటిని వడపోసి..కొద్దిగా నిమ్మకాయ పిండుకుని తీసుకోవాలి. ఇలా ప్రతిరోజూ ఉదయం పరగడుపున తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి. అధిక బరువు సమస్య నుంచి గట్టెక్కేందుకు జీలకర్రతో ఈ మూడు విదానాలు మంచి ఫలితాలనిస్తాయి.

# రోజూ ఉదయం ఈ నీళ్లు తాగితే.. యూరిక్ యాసిడ్ కరుగుతుంది..!



రక్తంలో యాసిడ్ పెరిగితే.. హైపర్యూరిసెమియా అంటారు. ఈ రోజుల్లో శరీరంలో యూరిక్ యాసిడ్ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. కిడ్నీలు యూరిక్ యాసిడ్‌ను సమర్థవంతంగా తొలగించలేనప్పుడు మన శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు చాలా వరకు పెరుగుతాయి. యూరిక్ యాసిడ్... మన శరీరం సహజంగా విసర్జించే వ్యర్థ పదార్థాల్లో ఇది కూడా ఒకటి. మనం తీసుకునే ఆహార పదార్థాల్లోని 'ప్యూరిన్' అనే రసాయనం విచ్ఛిన్నం అయినప్పుడు యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. ఇది ఎప్పటికప్పుడు మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. విసర్జన సరిగా జరగకపోతే.. యూరిక్ యాసిడ్ రక్తంలోనే నిలిచిపోతుంది. క్రమంగా ఇవి స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోతాయి. దీనికి చాలా కారణాలు ఉన్నాయి.. ప్యూరిన్ అధికంగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవడం, అధిక బరువు, డయాబెటిస్, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య వచ్చే అవకాశం ఉంది.

**ఈ సమస్యలు వస్తాయ్..** శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరుగితే అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. గౌట్, గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, కడుపులో మంట, కిడ్నీలో రాళ్లు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, డయాబెటిస్, హైపోథైరాయిడిజం, కొన్ని రకాల క్యాన్సర్, సోరియాసిస్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. సాధారణంగా పురుషులలలో పురుషులలో 3.4-7.0 mg వరకు యూరిక్ యాసిడ్, మహిళల్లో 2.4- 6.0 mg వరకు యూరిక్ యాసిడ్ ఉంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయులు పెరిగితే కొన్ని ఇంటి చిట్కాలతో తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**యాపిల్ సైడర్ వెనిగర్..** యాపిల్ సైడర్ వెనిగర్ సహజమైన క్లెన్సర్, డిటాక్సిఫైయర్‌లా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాసిడ్‌కు, యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేసే సామార్థ్యం ఉంది. ఒక టీస్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్‌ను ఒక గ్లాసు నీటిలో వేసి కరిగించాలి. ఈ నీరు రోజుకు 2 నుంచి 3 సార్లు తాగితే మంచిది. యూరిక్ యాసిడ్ నియంత్రణలోకి వచ్చే వరకు ఈ నీరు తాగుతూ ఉండండి.

**నిమ్మకాయ..** నిమ్మకాయ శరీరంలో యూరిక్ యాసిడ్‌ను తగ్గించడానికి సహాయపడుతుందని ఓ అధ్యయనం వెల్లడించింది. నిమ్మకాయ తీసుకుంటే.. శరీరంలో ఆల్కలీన్ ప్రభావం పెరుగుతుంది, దీని వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గుతాయి. నిమ్మకాయలో ఉండే.. విటమిన్ సీ యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలపాలి. ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీరు తాగండి. ఈ నీరు వారం రోజులు తాగితే.. తేడా మీకే తెలుస్తుంది.

**ఆలివ్ ఆయిల్..** NCBI నివేదిక ప్రకారం, ఆలివ్ ఆయిల్ యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. ఇందులో విటమిన్ ఇ, విటమిన్ కె, ఐరన్, ఒమేగా 3, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. వంటలో నెయ్యి, ఎడిబుల్ ఆయిల్‌కు బదులుగా ఆలివ్ ఆయిల్ ఉపయోగిస్తే మంచిది.

**బేకింగ్ సోడా..** శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించడానికి బేకింగ్ సోడా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు గౌట్ నొప్పిని తగ్గించడానికి బేకింగ్ సోడా సహాయపడుతుందని అంటున్నారు. బేకింగ్ సోడా ఆల్కలీన్ స్థాయిని నిర్వహిస్తుంది, దీని వల్ల యూరిక్ యాసిడ్ కరుగుతుంది. ఒక గ్లాసు నీటిలో ఒకటి లేదా అర టీస్పూన్ బేకింగ్ సోడా వేసి కలపండి. ప్రతి రెండు నుంచి నాలుగు గంటలకు ఈ నీరు తాగండి. ఇలా చేస్తే శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయులు తగ్గుతాయి.

# నటుడు పృథ్వీరాజ్‌కు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ



30 ఇయర్స్ ఇండస్ట్రీ' పేరిట మంచి గుర్తింపు తెచ్చుకున్న సినీనటుడు పృథ్వీరాజ్‌కు ఊహించని షాక్ తగిలింది. విజయవాడ స్థానిక ఫ్యామిలీ కోర్టు అతడికి నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. మనోవర్తి చెల్లించాలంటూ పృథ్వీ భార్య బలిరెడ్డి శ్రీలక్ష్మి అతడిపై ఫ్యామిలీ కోర్టులో వేసిన కేసులో ఈ పరిణామం చోటుచేసుకుంది.

భార్య బలిరెడ్డి శ్రీలక్ష్మికి నెలకు రూ.8 లక్షలు చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ ఆదేశాలను పాటించని పృథ్వీ హైకోర్టులో సవాలు చేశారు. కేసును పరిశీలించిన న్యాయస్థానం తాత్కాలిక ఉపశమనం కల్పిస్తూ భార్యకు నెలకు రూ.22వేల చొప్పున చెల్లించాలని ఆదేశించింది. అప్పటి వరకు ఉన్న బకాయిలు మొత్తం చెల్లించాలని స్పష్టం చేసింది. అయితే పృథ్వీరాజ్ హైకోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయలేదు. దీంతో భార్య శ్రీలక్ష్మి తన న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, సప్పా రమేష్, సీహెచ్ వడ్డీకాసులును సంప్రదించి ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేశారు.

పృథ్వీరాజ్ కోర్టుకు హాజరుకాకుండా కేసు వివరాలను ఒక దినపత్రికలో ప్రకటన చేశారని, కోర్టుకు హాజరుకావడం లేదని లాయర్లు పిటిషన్‌లో వివరించారు. ఫ్యామిలీ కోర్టు జడ్జి బుధవారం పిటిషన్‌ను పరిశీలించారు. పృథ్వీరాజ్‌కు నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంటు జారీ చేశారు. దీంతో పృథ్వీరాజ్ చిక్కుల్లో పడ్డట్టు అయింది.

# ఎమ్మెల్యే పంచకర్ల జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు జన్మదినం సందర్భంగా కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది నాయకులు కరణం జగదీష్, మాడిస వెంకట్రావు, సింగిడి సింహాచలం, దాసరి రామారావు, తురు సాల శ్రీనివాసరావు, కర్రీ రామజోగి నాయుడు, మచ్చ శివకుమార్, కర్రీ జువ్వలు , రేవతి, శాంతి, హనిత, మూర్తి, చంద్రరావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విలక్షణ విమర్శకుడు శ్రీ శ్రీ " ఆచార్య వెలమల సిమ్మన్న




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సహృదయసాహితి ఆధ్వర్యంలో నేడు ప్రిజం కళాశాల లో జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో "విలక్షణ విమర్శకుడు శ్రీ శ్రీ" అనే విషయంపై ఆచార్య వెలమల సిమ్మన్న హాజరై ప్రసంగించారు.

సభకు అధ్యక్షత వహించిన శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహాకవి శ్రీ శ్రీ అలుపులేని అన్వేషి, వెనుతిరగని సాహసి నిరంతర ప్రయోగ దక్షుడు. ఉద్యమాలకు స్పందించాడు, జనం జీవనాడి తెలుసుకున్నాడు, పోరాటాలు పసిగట్టేడు, కవిత్వాన్ని ఆరాధించాడు. ప్రయోగశాలిగా పదునైన విమర్శకుడిగా వినుతికెక్కాడు. అన్నారు.

అనంతరం ఇటీవల దివంగతులైన కవి, సహృదయసాహితి వ్యవస్థాపక సభ్యులు, ప్రవచన కారుడు, ఆధ్యాత్మిక వేత్త శ్రీమాన్ టి పి యవ్ ఆచార్యులు గారి ఆత్మ శాంతికై సహృదయసాహితి రెండు నిముషాలు మౌనం వహించి స్మృత్యంజలి ఘటించింది.

ప్రసంగాన్ని సమీక్ష చేసిన డాక్టర్ కె వి యస్ మూర్తి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సరికొత్త వరవడిని, వాడిని సృష్టించిన శ్రీ శ్రీ ఎప్పటికి అమరుడే అన్నారు.

అనంతరం డాక్టర్ డి వి సూర్యారావు ప్రసంగించారు.

డాక్టర్ సూరపనేని విజయకుమార్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ఇంకా సిహెచ్ చిన సూర్యనారాయణ,,కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వర రావు, డాక్టర్ కె వి యస్ మూర్తి, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కె రాంప్రసాద్,,వి కె శర్మ, ఉప్పల అప్పలరాజు,,బి రాధా రాణి, సురేష్, పిల్లా రమణమూర్తి, పరమేశ్వరరావు ,అయ్యలసోమయాజుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పిలి భీమేశ్వర రావు వందన సమర్పణ చేశారు.

# పుణె కారు ప్రమాదం కేసు

## బయటపడుతున్న డాక్టర్ క్రిమినల్ నెట్‌వర్క్



మహారాష్ట్రలోని పుణెలో ఓ మైనరు (17) నిర్లక్ష్య డ్రైవింగు కారణంగా ఇద్దరు ఐటీ ఉద్యోగులు మృతిచెందిన కేసు దర్యాప్తులో కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు బయటపడుతున్నాయి. రక్త నమూనా మార్పిడికి పాల్పడిన డాక్టర్ సామాన్యుడు కాదు. అతడి వెనుక పెద్ద రాకెట్ నడుస్తోంది. ఇక తాజాగా నిందితుడి తండ్రి విశాల్ అగర్వాల్ ఏకంగా జువైనల్ జస్టిస్ బోర్డు ప్రాంగణంలోనే రూ. లక్షలు లంచం చెల్లించినట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన సీసీ టీవీ దృశ్యాలను కూడా సేకరించారు. నిందితుడి రక్త నమూనాలను మార్చేందుకు ఈ సొమ్మును ససూన్ ఆస్పత్రి ప్యూన్ అతుల్ ఘట్‌కాంబ్లే అనే వ్యక్తి వచ్చి తీసుకెళ్లినట్లు ధ్రువీకరించారు. మధ్యవర్తికి విశాల్ అగర్వాల్ డ్రైవర్ ద్వారా రూ. 4 లక్షలు అందజేశాడు. వీటిల్లో రూ.3 లక్షలను అతుల్‌కు చెల్లించారు. ఇప్పటికే ఆస్పత్రి ప్యూన్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఇక విశాల్ అగర్వాల్ దంపతులు, ఈ వ్యహారానికి మధ్యవర్తిగా వ్యవహరించిన అష్ఫాక్ మకాన్‌దార్ అనే వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. అమర్ గైక్వాయిడ్ అనే వ్యక్తి కూడా మధ్యవర్తిగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఈ కేసులో నిందితుడి రక్త నమూనాలను అతడి తల్లి బ్లడ్ శాంపిల్స్‌తో భర్తీ చేసిన విషయం తెలిసిందే.

**నాలుగు జిల్లాల్లో క్రిమినల్ రాకెట్..!**

ససూన్ ఆస్పత్రిలోని ఫొరెన్సిక్ విభాగం పనితీరుపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి. ఈ విభాగం అధిపతి అయిన డాక్టర్ అజేయ్ తావ్‌డే గతంలో కూడా పలు కేసుల్లో ఇలానే రక్త నమూనాలు మార్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుణె క్రైం బ్రాంచ్ అధికారులు కూడా ఇలాంటి అభిప్రాయాన్నే ఓ ఆంగ్ల వార్తా పత్రిక వద్ద వ్యక్తం చేశారు. తావ్‌డే నిందితుల రక్తనమూనాలు మార్చేయడం ఇదే తొలిసారి కాదని వారు పేర్కొన్నారు. ఇతడికి సంబంధించిన డాక్టర్లు, బ్రోకర్ల నెట్‌వర్క్ పుణె చుట్టుపక్కల పశ్చిమ మహారాష్ట్రలోని నాలుగు జిల్లాల్లో విస్తరించినట్లు వెల్లడించారు. ఏదైనా హైప్రొఫైల్ కుటుంబం మద్యపానం చేసి వాహనం నడిపినట్లు కేసు నమోదైతే.. ఈ నెట్‌వర్క్ ఆ కుటుంబాన్ని సంప్రదిస్తుంది. తర్వాత కొంత మొత్తం సొమ్ములు తీసుకొని రక్తనమూనాలు మార్చేసి.. స్వల్ప శిక్షలు పడేట్లు చేస్తుంది. కేసును బట్టి కనీసం రూ.5 లక్షలు వసూలు చేస్తారని చెబుతున్నారు. దాదాపు రెండేళ్ల నుంచి ఈ నెట్‌వర్క్ చురుగ్గా పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

**తావ్‌డేపై గతంలో కూడా ఆరోపణలు..**

ఈ కేసులో కీలక నిందితుడైన ససూన్ ఆస్పత్రి ఫొరెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ తావ్‌డేపై గతంలో కూడా తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. డ్రగ్ కేసులు, కిడ్నీ మార్పిడి రాకెట్ వంటి నేరాల్లో అతడి పేరు వినిపించింది. అయినా కానీ, అతడిని ఫొరెన్సిక్ విభాగానికి అధిపతిగా పదోన్నతి కల్పించారు. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతోనే ఇలా జరిగినట్లు తెలుస్తోంది.

గత నెలలో ససూన్ ఆస్పత్రి డీన్ వినాయక్ కాలే మాట్లాడుతూ మహారాష్ట్ర మంత్రి హసన్ ముశ్రాఫ్, స్థానిక ఎమ్మెల్యే సునీల్ టింగ్రేల నుంచి ఓ లేఖ వచ్చిందని.. దానిలో తావ్‌డేను హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ చేయాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ ప్రకటన తర్వాత వినాయక్ కాలేను ప్రభుత్వం బలవంతపు సెలవుపై పంపించింది. ఈయన ప్రస్తావించిన ఇద్దరు నేతలు అజిత్ పవార్ వర్గానికి చెందినవారే. ప్రమాదం జరిగిన కొద్ది గంటల్లోనే యర్వాడ పోలీస్ స్టేషన్‌ను ఎమ్మెల్యే సునీల్ సందర్శించడం విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ వ్యహారంలో బ్రోకర్ అష్ఫాక్ మకాన్‌దార్‌తో సునీల్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. 'విశాల్‌కు సాయం చెయ్యి' అని ఎమ్మెల్యే చెప్పడంతోనే అతడు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

# ప్రజల తీర్పుతో మరింత బాధ్యత పెరిగింది : విజయనగరం ఎంపి



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రజల తీర్పుతో మరింత బాధ్యత పెరిగింది అని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి కి ఉత్తరాంధ్ర ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజల తీర్పు తో మరింత బాధ్యత పెరిగింది అని అన్నారు. చంద్రబాబు విశాఖ ను ఆర్థిక రాజధానిగా ప్రకటించడం ఆనందం కలుగజేసింది..విశాఖ ను ఆర్థిక రాజధానిగా ప్రకటించినందుకు చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలియజేశారు. టికెట్లు , పదవుల విషయంలో చంద్రబాబు ఉత్తరాంధ్ర కు పెద్ద పీట వేశారు అని చెప్పారు.

చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి అవసరమని ఇతర రాష్ట్రాలలో ఉన్న ప్రజలు వచ్చి ఓట్లు వేశారు అని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కి కృషి చేస్తాం. కొంత మంది ప్రభుత్వం ఏర్పాటు కాకముందే విమర్శలు ప్రారంభించారు. ప్రమాణస్వీకర కార్యక్రమనికి జగన్మోహన్ రెడ్డి కి ఆహ్వానం ఇచ్చిన హాజరుకాలేదు అని ఎద్దేవా చేశారు రాష్ట్రంలో దాడులు జరుగుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు ప్రజలు అన్ని గమనిస్తున్నారు అని పేర్కొన్నారు కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రచార ప్రభుత్వం కాదు అన్నారు ఋషికొండా భవనాలను ప్రజల అవసరాలు కోసం ఉపయోగిస్తారు.

**కూటమి ప్రభుత్వం కూల్చే ప్రభుత్వం కాదు.**

ఆస్తులను కాపాడే ప్రభుత్వం అని తెలిపారు ఉత్తరాంధ్ర లో అసైన్డ్ భూముల కుంభకోణం పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం . ఉత్తరాంధ్రలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులు పై దృష్టి పెట్టాం అని తెలిపారు సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పలమలశెట్టి శ్రీనివాస్ రావు జిల్లా మీడియా కోఆర్డినేటర్ కె గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# అంత్యక్రియలు జరిగి 13 రోజులు గడిచిన తర్వాత.. ఇంటికి తిరిగొచ్చిన వ్యక్తి!

మధ్యప్రదేశ్‌లో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని గుర్తించిన కుటుంబం సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, అంత్యక్రియలు జరిగి 13 రోజులు గడిచిన తర్వాత ఆ వ్యక్తి ఇంటికి తిరిగి వచ్చాడు. అతడు బతికే ఉన్నాడని తెలుసుకున్న కుటుంబీకులు షాక్ అయ్యారు. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

వివరాల్లోకి వెళితే.. షియోపూర్ జిల్లా లహచొరా గ్రామానికి చెందిన సురేంద్ర శర్మ.. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని బట్టల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కాగా, రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్ సమీపంలోని సుర్వాల్‌లో గత నెల 26న రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చనిపోయిన వ్యక్తిని గుర్తించాలని కోరుతూ ఓ ఫొటోను అధికారులు ప్రచురించడం జరిగింది. అయితే, ఆ వ్యక్తిని సురేంద్రగా అతడి కుటుంబ సభ్యులు గుర్తించారు.

దీంతో రాజస్థాన్ పోలీసులు పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాన్ని సురేంద్ర ఫ్యామిలీకి అప్పగించారు. దాంతో వారు అంత్యక్రియలు నిర్వహించారు. మరోవైపు 13వ రోజున సురేంద్రకు దశ దిన కర్మలు చేసేందుకు అతడి ఫ్యామిలీ సిద్ధమైంది. సరిగ్గా అదే రోజు సురేంద్ర సరాసరి ఇంటికి వచ్చి కళ్లముందు ప్రత్యక్షమవడంతో కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. ఈ విషయాన్ని వెంటనే రాజస్థాన్ పోలీసులకు తెలియజేశారు. వారి సమాచారంతో అలర్ట్ అయిన పోలీసులు దర్యాప్తు చేసి చనిపోయిన వ్యక్తిని ధారా సింగ్ గా గుర్తించారు.

ఆ తర్వాత ధారా సింగ్ కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేశారు. పొరపాటున అతని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. అయితే, ధార బంధువులు అక్రమ అంత్యక్రియలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సురేంద్ర మామ ధర్మ్ రాజ్ శర్మ మాట్లాడుతూ.. చనిపోయిన వ్యక్తి, సురేంద్ర మధ్య దగ్గర పోలికల కారణంగా తప్పుగా గుర్తించడం జరిగిందన్నారు. పైగా అతని నుండి గత రెండు నెలలుగా కమ్యూనికేషన్ లేకపోవడం కూడా ఇలా జరగడానికి ఒక కారణమని వివరించారు.

సురేంద్ర సోదరుడు దేవేంద్ర జైపూర్ పోలీసులు పంచుకున్న ఫొటోలు, వీడియోల ఆధారంగా మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. సురేంద్ర కుటుంబ సభ్యుల తప్పుగా గుర్తించి, ధారా సింగ్ దహన సంస్కారానికి పాల్పడినందుకు వారిపై చర్యలు తీసుకోవాలనే యోచనలో అధికారులు ఉన్నారు.

# అయిదు ప్రాధాన్యత

ఆధ్యాత్మిక జీవన విధానంలో 'అయిదు'అనే సంఖ్యకు ఎంతో ప్రాముఖ్యత వుంది. అనేక అంశాలలో అయిదు ప్రాధాన్యతను సంతరించుకుని కనిపిస్తుంది. 'పంచసూక్తములు' ... ' పంచశక్తులు' ... ' పంచభూత లింగాలు' ... 'పంచమహా యజ్ఞాలు' ... 'పంచగవ్యములు' ఇలా ఎన్నో అంశాలు అయిదు అంకెతో ముడిపడి కనిపిస్తుంటాయి.

**పంచ సూక్తములు** అనగా : శ్రీ సూక్తం ... పురుష సూక్తం ... భూసూక్తం ... నీలా సూక్తం ... మాన్యు సూక్తం

**పంచ శక్తులు** అనగా : ఇచ్ఛాశక్తి ... జ్ఞానశక్తి ... క్రియా శక్తి ... ఆదిశక్తి ... పరాశక్తి

**పంచభూత లింగాలు** అనగా : పృథ్వీ లింగం ... ఆకాశలింగం ... జలలింగం ... వాయులింగం ... అగ్నిలింగం

పంచమహా యజ్ఞాలు అనగా : దేవయజ్ఞం ... బ్రహ్మయజ్ఞం ... భూత యజ్ఞం ... పితృ యజ్ఞం ... మనుష్య యజ్ఞం

**పంచగవ్యములు అనగా** : ఆవు పంచతము ... ఆవు పేడ ... ఆవుపాలు ... ఆవుపెరుగు ... ఆవునెయ్యి

**పంచమహాపాతకాలు** అనగా : స్త్రీ హత్య ... శిశుహత్య ... గోహత్య ... బ్రహ్మ హత్య ... గురుహత్య.

# ఉగ్రవాదికి క్షమాభిక్షను తిరస్కరించిన రాష్ట్రపతి



దిల్లీ: దేశ రాజధానిలో కాల్పులకు పాల్పడిన ఓ ఉగ్రవాది.. తన ఉరిశిక్షను రద్దు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరస్కరించారు. దేశ భద్రత, ప్రజల ఐకమత్యం, సార్వభౌమాధికారానికి భంగం కలిగించే చర్య కావడంతో ఆమె క్షమాభిక్షకు అంగీకరించలేదని రాష్ట్రపతి భవన్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. డిసెంబరు 22, 2000లో దిల్లీలోని ఎర్రకోట వద్ద పహారా కాస్తున్న వారిపై.. పాకిస్థాన్ నుంచి అక్రమంగా భారత్‌లోకి చొరబడిన నలుగురు వ్యక్తులు కాల్పులకు పాల్పడ్డారు. ఇందులో ముగ్గురు ఆర్మీ సిబ్బంది అమరులయ్యారు. ఘటన జరిగిన రెండ్రోజుల అనంతరం నిందితుల్లో ఒకరైన మహమ్మద్ ఆరిఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత మిగతా ముగ్గురు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మృతిచెందారు. పలు విచారణల అనంతరం నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్-ఎ-తోయిబాకు చెందిన ఆరిఫ్‌కు ఉరిశిక్ష విధిస్తూ 2005 అక్టోబరులో ట్రయల్ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పును 2007లో దిల్లీ హైకోర్టు, 2011లో సుప్రీం కోర్టులు సమర్థించాయి. అనంతరం నిందితుడు పలు అప్పీళ్లు, రివ్యూ పిటిషన్లు దాఖలు చేసినా ఫలితం లేకపోయింది. చివరి యత్నంగా క్షమాభిక్ష కోరుతూ మే 15న రాష్ట్రపతికి దరఖాస్తు చేయగా.. మే 27న ఆమె తిరస్కరించారు. రాష్ట్రపతిగా ముర్ము బాధ్యతలు చేపట్టిన తర్వాత క్షమాభిక్ష తిరస్కరించడం ఇది రెండోసారి.

# కనకమహాలక్ష్మి' హుండీల ఆదాయం రూ. 59.16 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, శ్రీహరి సేవ వాలంటీర్లు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పాతనగరం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. మార్చి 21 నుంచి ఈనెల 12వ తేదీ వరకు మొత్తం 84రోజులకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా నగదు రూపేణా రూ.59,16,692, బంగారం 131.500 గ్రాములు, వెండి కిలో మూడు గ్రాములు వచ్చిందని ఆలయ ఈఓ పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అమెరికా డాలర్లు 22, యుఏఈ దిర్హామ్స్ 5, కెనడా డాలర్లు 5, సింగపూర్ డాలర్లు 32, మలేసియా రింగిట్ 3, రూ. 6 వేల విలువైన వియత్నాం కరెన్సీ లభించాయన్నారు. ఏఈఓలు వి.రాంబాబు, తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజరు లక్ష్మణమూర్తి, శ్రీహరి సేవా సభ్యులు (గోపాలపట్నం) పాల్గొన్నారు.

# ఆమలక ఏకాదశి విశిష్టత

శ్రీమహావిష్ణువు స్థితి కారకుడు ... సమస్త జీవరాసుల జీవన విధానానికి సంబంధించి ఆయన సమతుల్యతను సాధిస్తుంటాడు. అలాంటి శ్రీమహావిష్ణువు రూపాన్ని దర్శించడం వలన ... ఆయన నామాన్ని స్మరించడం వలన అనేక జన్మల పాపాలు నశిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. లోక కల్యాణం కోసం వివిధ అవతారాలను ... అనేక రూపాలను పొందిన స్వామిని అనుదినం భక్తులు పూజిస్తూనే ఉంటారు ... అనుక్షణం ఆరాధిస్తూనే ఉంటారు.

అయితే ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున స్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించిన వారికి అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఫాల్గుణ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశినే 'ఆమలక ఏకాదశి' అని అంటుంటారు. ఉసిరికాయనే ఆమలక ఫలం ... ధాత్రీ ఫలం అని పిలుస్తుంటారు. కార్తీకమాసంలో జరిపే శివారాధన విషయంలో విశిష్టమైన స్థానాన్ని కలిగినదిగా కనిపించే ఉసిరికాయ, ఫాల్గుణ మాసంలో శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు స్వరూపంగా భావించబడుతోంది.

అందువలన ... ఈ ఆమలక ఏకాదశి రోజున ఎవరైతే ఉసిరిచెట్టు కింద ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తారో, వాళ్ల నివాసం పుణ్యాలకు పుట్టినిల్లుగా మారుతుందనీ, భోగ భాగ్యాలతో తులతూగుతారని చెప్పబడుతోంది. దీనిని బట్టి అటు శివ పూజలోను ... ఇటు కేశవుడి ఆరాధనలోను ఉసిరికాయకు గల ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. ఈ రోజున ఉదయాన్నే తలస్నానం చేసి ... పరిశుభ్రమైన వస్త్రాలను ధరించి ... ఉపవాస దీక్షను చేపట్టి శ్రీమహావిష్ణువును సేవించాలి.

ఆ రాత్రంతా జాగరణ చేసి మరునాడు ఉదయం ద్వాదశి ఘడియలు ఉండగానే స్వామిని పూజించి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించవలసి ఉంటుంది. ఇక ఈ ఏకాదశి రోజున వ్రతాన్ని చేసిన తరువాత అయినా ... ఆ మరునాడు పూజ ముగించిన తరువాత అయినా దానం చేయాలని శాస్త్రం చెబుతోంది. ఎవరైతే ఆమలక ఏకాదశి సందర్భంగా దానం చేస్తారో, వారి సంపదలు రెట్టింపు అవుతాయనీ ... పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని చెప్పబడుతోంది.

# యువ నటీ నటులకు శుభవార్త



వచ్చే గురు వారం జూన్ 20 నుండే వారం వారం మీగడ గురువారం శీర్షిక: మన (పద్య) నాటకం తెలుగు భాషకే మణి మకుటం వారం వారం 5 నిమి...నుండీ 10 నిమి ..లోపే! నాటకం గురించి ముఖ్య విషయాలు సంక్షిప్తంగా యువత కోసం U tube లో dr meegada సబ్స్క్రైబ్ చేయండి !అన్ని రకాల వీడియోలు చూడండి! సదా సాహితీ నాటక సేవలో......

-డా.మీగడ

# గందరగోళంలో బదిలీ ఉపాధ్యాయులు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వైసీపీ ప్రభుత్వం లో మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విద్యాశాఖ అధికారులు కలిపి ఇచ్చిన బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం నిలిపివేయడంతో ఉపాధ్యాయులకు ఈ సమస్య గుదిబండగా మారిందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన, ఎన్నికల కోడ్ ముగిశాక రిలీవ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జారీ చేసిన ఉత్తర్వులతో బదిలీ అయిన ఉపాధ్యాయులు సంబరపడ్డారని, ప్రభుత్వం మారడంతో అక్రమ బదిలీలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉపాధ్యాయులలో ఆందోళన వ్యక్తం అయిందని, ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల కోడ్ కు ముందు 25 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారని,



కావలసిన చోటకు 5 లక్షల తీసుకొని విద్యాశాఖ మంత్రి మొదలుకొని వివిధ స్థాయి గల విద్యాశాఖ అధికారుల వరకు అవినీతి పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయని, అందువల్లనే సాధారణ బదిలీలతో సంబంధం లేకుండా తమకు కావలసిన వారిని నచ్చిన చోటకు బదిలీ చేసే దుస్సంప్రదాయం ఎంతో కాలంగా సాగుతుందని, అక్రమ బదిలీలపై వచ్చిన వారిపైన, అందుకు సహకరించిన తోడ్పడిన వారిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో విద్యాశాఖలో ఇదొక వరవడిగా మారిందని వెంకటరావు అన్నారు. నగరంలోకి బదిలీపై రావడానికి అర్హత లేకపోయినా విద్యాశాఖ ఉన్నతాధికారులను పట్టుకొని తమకు కావలసిన ఉపాధ్యాయులను నగర పరిధిలోని పాఠశాలలకు తీసుకొచ్చే పెద్దలు లేకపోలేదని, పలుకుబడి కలిగిన మంత్రులు ఎమ్మెల్యేలను పట్టుకొని గత ప్రభుత్వంలో కొంతమంది ఉపాధ్యాయులు డబ్బులు ఇచ్చి నగరం నడిబొడ్డున పాఠశాలకు బదిలీ చేయించుకున్నారని, అక్రమ బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో ఏ పలుకుబడి లేని ఉపాధ్యాయులు నష్టపోతున్నారని, దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టి ఉపాధ్యాయులు చెల్లించిన డబ్బులు తిరిగి చెల్లించే విధంగా అలాగే మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విద్యాశాఖ అధికారులపై త్వరితగతిన విచారణ చేసి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వెంకటరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ పార్లమెంటు ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్ తదితరులు పాల్గొన్నారు.

# రాక్షసుడు చెరుకూరి రామోజీరావు

**The Genghis Khan of Telugu Journalism**

రామోజీరావు మార్గదర్శి డబ్బుల్తో ఒక గుర్రం కొన్నాడు. ఆరోగ్యంగా బలిష్ఠంగా ఉన్న ఆ గుర్రంపై ఎగిరి కూర్చుని దూసుకుపోతున్నాడు రామోజీ, ఒక మంగోల్ వీరునిలా! జయించాలి, యుద్ధం చేసన్నా సరే, సాధించాలన్న కాంక్ష అతన్ని కుదురుగా వుండనివ్వడం లేదు. ఎదురుగా వున్న పెద్ద కొండపైకి గుర్రాన్ని పోనిచ్చాడు. ఆ ఎత్తు నుంచి కనిపిస్తున్న సువిశాలమైన ప్రదేశాన్ని పరికించి చూశాడు. విజయవాడ, హైద్రాబాద్ అనే చోట్ల కొన్ని పురాతన తండాలు వార్తా పత్రికలు పెట్టుకుని బతుకుతున్నాయి. దూరంగా సముద్ర తీరాన వున్న విశాఖలో మందుతున్న నెగళ్ల చుట్టూ ఆటవిక తండాలు! అక్కడ వార్తా పత్రికల సందడిలేదని గుర్తించాడు. వేల సైన్యమూ, విల్లంబులూ లేకుండానే ఆ ప్రాంతాన్ని జయించవచ్చని ఇట్టే పసిగట్టాడు. ఉత్తరాంధ్ర వ్యూహ రచన సిద్ధం చేశాడు. చిన్న సైజు ఆర్మీతో రంగంలో దూకాడు.

అది 1974 ఆగస్టు 10వ తేదీ.

'ఈనాడు' దినపత్రిక ప్రారంభం అయింది.

కొన్ని నెలల్లోనే తొలి విజయం కేక పెట్టింది.

కొట్టాల్సిందిక కుంభస్థలమే అని, రాజధాని హైద్రాబాద్ వైపు గుర్రాన్ని దౌడు తీయించాడు. 1975 డిసెంబరు 17న ఖైరతాబాద్ నుంచి ఈనాడు పబ్లికేషన్ ప్రారంభమైంది. ఎ.బి.కె.ప్రసాద్ అనే సేనాధిపతిని వొదిలించుకున్న రామోజీ, బూదరాజు రాధాకృష్ణ, రాంభట్ల కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, మోటూరి వెంకటేశ్వరరావు అనే అతిరథుల్ని కదనరంగంలోకి దించాడు. తొలినాళ్ల వొడిదుడుకుల్ని తట్టుకుని పత్రికను నిలబెట్టాడు. After a while it was a sensational victory and the rest is history.

1977 జూలై 19న హైదరాబాద్ 'ఈనాడు'లో జాయిన్ అయ్యాను. అనువాదం చెయ్యడం చేతకాదు. హైద్రాబాద్ కొత్త. ఏమీ తెలీదు. అపుడు నాకు 19 ఏళ్లు. "నాతోపాటు ఈనాడులోనే వుండు అన్నారు మోటూరి. మూడో అంతస్తులో లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నారు. పుస్తకాల అల్మరాల మధ్య దుప్పట్లు పరుచుకుని, రగ్గులు కప్పుకుని నిద్రపోయేవాళ్లం. పని చేస్తున్న పెద్దలంతా కమ్యూనిస్టులు. నా నేపథ్యమూ అదే గనక, ప్రేమగా, గారాబంగా చూసుకునేవాళ్లు. (గారాబం ఏమిటో? టీకి తీసుకెళ్లడం, సిగిరెట్ వెలిగించడం, సాయంకాలాలు చల్లని కింగ్ ఫిషర్, ఉల్లిపాయిలూ, మసాలా పల్లీ... ఆ షోకే వేరు!). అప్పటికి రామోజీ పేరు వినడమే. చూడనే లేదు. ఓ రోజు ఉదయం పదిన్నరకి, ఏమీ తోచక ఈనాడు టెర్రస్ మీదికి వెళ్లాను. రాంభట్ల, మరో వ్యక్తీ మాట్లాడుకుంటున్నారు. సిమెంట్ దిమ్మమీద కాలు పెట్టి, మోకాలి మీద చెయ్యిపెట్టి మాట్లాడుతున్న వ్యక్తి, గోల్డ్ రిమ్ కళ్లద్దాల్లోంచి చటుక్కున చూశాడు. నా లాంటి కుర్రాళ్లు జడుసుకునేలా వుంది ఆ చూపు. తెల్లపాంటూ, తెల్లచొక్కా ఆయనే అని ఇట్టే తెల్సిపోతుంది. రాజీపడటాన్ని సహించలేని రామోజీని చూడ్డం అదే మొదటిసారి. ట్రైనింగ్ ముగిసి, డెస్క్ వర్క్ పట్టుబడ్డాక విశాఖ పంపించారు. 1978 ఫిబ్రవరి 15 ఉదయం, తాడిచెట్ల వెనక ఎర్రని సూర్యోదయాన్ని చూస్తూ సీతమ్మధార వెళ్లాం. పచ్చని పూలచెట్ల మధ్య ఈనాడు ఆఫీసు. మొదటి నెలల్లోనే గుర్తింపు తెచ్చుకున్నా.

హైద్రాబాద్ నుంచి రామోజీ ఎప్పుడన్నా వచ్చేవారు. ఎండీలూ, మేనేజర్లు... "ఛైర్మన్ గారు వస్తున్నారు, వచ్చేస్తున్నారు" అని హడావిడి చేసేవారు. మాయాబజార్ లో శిష్యగణం సిద్ధం అవుతుంది. చిన్నమయ్య కంట్రోలు చేస్తుంటాడు. పెద్ద ఢంకా మీద వెలుగు... ఆరి మళ్లీ వెలుగు... అదిరిపోయే సంగీతంతో "ఘటో... ఘటోత్గజ" అని విన్పిస్తుంది. నిలువెత్తు ఘటోత్కచుడు భుజమ్మీద గదతో, పద్యంతో ప్రత్యక్షం అవుతాడు. అంత బిల్డప్ వుండేది రామోజీ వస్తున్నాడంటే!

ఓ రోజు ఎం.డీ.అప్పారావు పిలిచి, డాల్ఫిన్ హోటల్లో ఛైర్మన్ గారున్నారు, రమ్మన్నారు, వెళ్లండి అన్నారు. వెళ్లాను. డాల్ఫిన్ ఇంకా నిర్మాణంలో వుంది. నేను కనిపించగానే 'కమాన్' అంటూ ఇటుకలూ, ఇసుక, ఇనప చువ్వలూ దాటుకుంటూ రామోజీ గబగబా రెండు అంతస్తులు ఎక్కారు. వెనకే నేను. పక్కనే వున్న ఇసుక తోట అనే స్లమ్ తగలబడిపోతోంది. "వెళ్లి అదంతా చూసి రాయండి" అన్నారు. ఎంతో మంది సీనియర్లు, రిపోర్టర్లూ వుండగా నాకాపని అప్పగించారు. అది మొదటి గుర్తింపు. ఆనాటి ప్రమాదంలో తొమ్మిది మంది చనిపోయారు. వందల ఇళ్లు కాలిపోయాయి. వివరంగా వార్త రాశాను.

విశాఖ ఈనాడు ఆఫీసులోనే... ముందు రామోజీ గెస్ట్ హౌస్ వుంటుంది. ఎడిటోరియల్ సిబ్బందితో ఒక రోజు మీటింగ్. పదిహేను, ఇరవై మందిమి రామోజీ ఎదురుగా కూర్చుని వున్నాం. పేపర్ గురించి సాధక బాధకాలు మాట్లాడుతున్నారు. సీతారాంరెడ్డి అనే జర్నలిస్టు సమస్యలు, జీతాల గురించీ చెప్పబోయాడు, వెంటనే రామోజీ "జాగ్రత్త! తోక కత్తిరిస్తా" అని హెచ్చరించారు. నేను ఆశ్చర్యపోయాను. అప్పట్లో ఈనాడు ఉత్తరాల కాలమ్ నేనే చూసేవాణ్ణి. స్కైలాబ్ భూమ్మీద పడుతుందనీ, విధ్వంసం తప్పదనీ వార్తలు జోరుగా వస్తున్న కాలమది. స్కైలాబ్ ఎక్కడ పడుతుందో? అని ఒక పాఠకుడు లేఖ రాస్తే, నేను దాన్ని మార్చి రాసి, "అద్వానీ నెత్తిమీద పడితే...." అని హెడ్డింగ్ పెట్టాను. ఆ రోజే పబ్లిష్ అయింది. కమ్యూనిస్టు హేంగోవర్ వల్ల అంత బాధ్యతారహితంగా శీర్షిక పెట్టాను. ఉత్తరాల కాలమ్ ఎవరు చూస్తున్నారు? ఆ హెడ్డింగ్ పెట్టిందెవరు? అని రామోజీ అడిగారు. నేను లేచి నిలబడి, హెడ్డింగ్ పెట్టింది నేనేననీ, పొరపాటు జరిగిందనీ వినయంగా చెప్పాను. ఆయన "నో..." అన్నాడు. హమ్మయ్య అనుకున్నా. రామోజీ చిన్న పాజ్ యిచ్చి, "పొరపాటు కాదు, Its a blunder" అని అరిచినంత పని చేశారు. నేను బిగుసుకుపోయాను.

ఒంటిచేత్తో ఆంధ్ర ప్రదేశ్ ని జయించగలనని తెలిసిన విజనరీ గనక, రామోజీ పత్రికని పంచ ప్రాణాలు పెట్టి చూసుకునేవాడు. మొదటి పేజీ పెట్టిందెవరు? ఫలానా హెడ్డింగ్ ఎవరిది? ప్రతి విషయం, ప్రతిరోజూ గమనించి, మాకు కామెంట్స్ పంపేవారు. తిరుపతి ఎడిషన్ పెడుతున్నపుడు కె.ఎన్.వై.పతంజలినీ, రెండో వాడిగా నన్నూ పంపించారు. మాకు ప్రమోషన్లు యిచ్చారు. 1982 జూన్ 20న ప్రారంభమైంది తిరుపతి 'ఈనాడు' ఎడిషన్. ప్రింటింగ్ మొదలవ్వడానికి 15 రోజుల ముందే రామోజీ రేణిగుంట ఆఫీసుకు వచ్చారు. వారం పది రోజులు పతంజలి, నాతో కలిసి పని చేశారు. అప్పుడు ఎంతో ఈజీగా, హాయిగా వుండే రామోజీని చూశాను. పతంజలి న్యూస్ ఎడిటర్ సీట్లో వుంటే, ఆయన ఎదురుగా (గెస్టులాగా) రామోజీ కూర్చునేవారు. డెస్క్ ఇంఛార్జి సీట్లో నేనుంటే, అటూ యిటూ సబ్ ఎడిటర్లు కూర్చోడానికి పన్నెండు కుర్చీలయినా వుంటాయి. చిన్న ఉద్యోగిలా నా పక్కనే కూర్చునేవారు. వార్తలు ఏమొస్తున్నాయి? హెడ్డింగులు ఏం పెడుతున్నారు.. ఇన్ టైంలో పేపర్ డెలివర్ చేయగలమా? అన్నీ గమనించేవారు. మాతో మాట్లాడేవారు.

**The action packed RamojiRao**

ఒక రోజు రామోజీ, ఎడిటోరియల్ సెక్షన్ లో నా దగ్గరకొచ్చి, 'రండి' అన్నారు. లేచి నించున్నాను, నా ఎడం చెయ్యి పట్టుకుని కొంచెం దగ్గరకి లాక్కుని, భుజమ్మీద చెయ్యేశారు. కార్మికులంతా వుండే పేజీ మేకింగ్ సెక్షన్ వైపు నడుస్తున్నాం. పేపర్ కి సంబంధించిన సంగతులేవో చెబుతున్నారాయన. నెమ్మదిగా కంపోజర్లు, ఇంపోజర్లు, కెమేరా సెక్షన్ సిబ్బంది వుండే హాల్లోకి వెళ్లాము. రామోజీరావు చెయ్యి నా భుజమ్మీదే వుంది. మొదటి పేజీ పెట్టే చోట ఆగి "పెట్టండి పేజీ" అన్నారాయన. వార్తలు ఎక్కడ ఏవి పెట్టాలో చెబుతున్నా. "హెడ్డింగులు పెట్టరా" అన్నారాయన. ఆయనే కాగితాలిచ్చి, రాయండి అన్నారు. కొన్ని హెడ్డింగులు పెట్టా. మార్చమన్నారు. మళ్లీ రాసిచ్చా. బావున్నాయన్నారు. ఆ బరువైన చెయ్యి యింకా నా భుజమ్మీదే! ఈ కథలో నీతి ఏమిటంటే, పతంజలి గారు ఎడిషన్ ఇన్ ఛార్జి కావొచ్చు. డే ఇన్ అండ్ డే అవుట్ పని చేసి పేపర్ ప్రొడ్యూస్ చెయ్యాల్సింది నేను. కనుక, రామోజీ అనే బ్రిలియంట్ పెట్టుబడిదారుడు అక్కడి వర్కర్లకి క్లియర్ గా మెస్సేజ్ యిచ్చారు. సాక్షాత్తూ ఛైర్మన్ గారే వీడి భుజమ్మీద చెయ్యేసి, స్నేహితుడిలా మాట్లాడుతున్నాడంటే... ఇక వాళ్లకి ప్రత్యేకించి చెప్పాల్సిందేముంది. ఆ రోజు నుంచీ నేనేం చెప్పినా వర్కర్స్ క్షణాల్లో చేసేసేవారు. రామోజీకి నా మీద కాదు. పేపర్ మీద తనకున్న ప్రేమ అది. మరో రోజు ఆయన నా సీట్లో కూర్చున్నారు. ఆ వార్త, ఈ వార్త అంటూ హడావుడి పడుతున్నా. ఇంతలో హైద్రాబాద్ నుంచి ఎడిటోరియల్ వచ్చింది. చదివాను. ఆయన చేతికిచ్చాను. రామోజీ చదివి అప్రూవ్ చేసిన తర్వాతే ఎడిటోరియల్ ప్రింటింగ్ కి వెళ్లాలి! ఆ రూలు తప్పడానికి వీల్లేదు. ఎడిటోరియల్ పది పన్నెండు లైన్లు ఎక్కువైంది, కట్ చేయాలని చెప్పాను. నాచురల్ గా నేనే కట్ చేయాలిగా... అయితే ఆయన చదివేసి 12 లైన్లు వున్న ఒక పేరాని కొట్టేశారు. అది చాలా మంచి ఎడిటింగ్. ఆ పేరా తీసేస్తే ఎడిటోరియల్ కి ఏ యిబ్బందీ లేదు. అనవసరమైన వివరాలనే రామోజీ కట్ చేశారు. అంత షార్ప్ ఆయన. "తమరి యొక్క కామన్ సెన్స్ తగలడిపోనూ" అనుకున్నా నేను.

రేణిగుంట ఈనాడు ఆఫీసులోనే పైన ఆయన గెస్ట్ హౌస్ వుంటుంది. పతంజలినీ, నన్నూ పైకి పిలిచారు. వెళ్లి ఆయన ఎదురుగా కూచున్నాం. చాలా రిలాక్స్ డ్ గా, హాయిగా వున్న రామోజీ... "ఇదిగో, యిలా బక్క పల్చగా, బాగా సన్నగా వున్న మీ యిద్దరినీ నమ్ముకుని రెండు కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టా. నాకు తెలుసు మీ యిద్దరూ కమ్యూనిస్టులని. ఇది తిరుపతి ఎడిషన్. కొండ మీదికి భక్తులు వస్తూనే వుంటారు. వాళ్లు హర్ట్ అయ్యే పనులేమీ చెయ్యకండి. దేవుడి సెంటిమెంటుకి విరుద్ధంగా కామెంట్ చెయ్యడం, వార్తలు వెయ్యడం... వద్దేవద్దు. నిజానికి నేను కూడా నాస్తికుణ్ణే. కానీ మనం ప్రజల సెంటిమెంటును గౌరవించాలి" అని చెప్పారు. ఒక రాక్షసుడు తన వ్యాపార ప్రయోజనాల కోసం నిజమైన మానవుడిగా మారిన ఒక స్వచ్ఛమైన దృశ్యాన్ని నేను చూడగలిగాను.

1983 జూన్ 15న మహాకవి శ్రీశ్రీ చనిపోయినపుడు, మంచి ఫొటో వేసి (అది నా కలెక్షన్) "నిప్పులు చిమ్ముకుంటూ నింగికెరిపోయిన శ్రీశ్రీ" అనే శీర్షికతో వార్త యిచ్చినపుడు, రామోజీ రావు నన్ను కంగ్రాచ్యులేట్ చేస్తూ ఒక పర్సనల్ మెస్సేజ్ పంపారు.

ఇది రామోజీ రావు గురించి మాట్లాడుకోవాల్సిన సమయం అని నేను అనుకుంటున్నాను. పత్రికాధిపతి గనక, మిగతా పత్రికలేవీ ఆయన పేరు స్మరించడానిక్కూడా యిష్టపడవు. మన సంకుచిత మనస్తత్వానికీ, ఇరుకు జర్నలిజానికీ యిదే గుర్తు. రామోజీరావుకి 75 ఏళ్లు వచ్చినపుడన్నా ఆయన గొప్పగా కంట్రిబ్యూట్ చేశాడనో, లేదా సవాలక్ష తప్పులు చేశాడనో ఏదో ఒక ఆబ్జెక్టివ్ అసెస్ మెంట్ చేయాలి కదా! ఐతే, రామోజీరావు ఒక ఫినామినా, ఒక లివింగ్ లెజెండ్ అని పొగిడి చేతులు దులిపేసుకోవడం, లేదా అతనో రాక్షసుడు, రాష్ట్ర ముఖ్యమంత్రులనే మార్చేసిన మాయల ఫకీరు, ధన పిశాచి అని శాపనార్థాలు పెట్టి మెటికలు విరవడం! అలా కాకుండా ఆయన విజయాల్నీ, వ్యక్తిత్వాన్నీ, స్వార్థపరత్వాన్ని కూడా సరిగా అంచనా వేసి విశ్లేషించడం అవసరమేమో.

**How can anybody on earth ignore Ramoji?**

శ్రీశ్రీని పేరడీ చేస్తే, బిల్ గేట్స్ ని తలుస్తారు, వారెన్ బఫెట్ ని కొలుస్తారు. రామోజీరావంటే భయంపుట్టి వణుకుతారు. అంటే మన పెట్టుబడిదారులనే మనం క్షమించం. ఎన్టీరామారావ్, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్ బాబులు పాతబడి, రోతపుట్టి అయిపోతున్నపుడు ఆశా కిరణంలా మెరిసింది చిరంజీవి! జనానికి కావాల్సిన కొత్త డ్యాన్సుల, గమ్మత్తుల, బూతుపాటల మజాని యిచ్చిన వాడు చిరంజీవి! అచ్చుగుద్దినట్టు అలాగే, ఆంధ్ర పత్రిక, ప్రభ, జ్యోతి, భూమి, విశాలాంధ్ర, ప్రజాశక్తి... ఇంకా సంప్రదాయ జర్నలిజం చూరుపట్టుకు గబ్బిలాల్లా వేలాడుతున్నపుడు ఉరుములు, మెరుపులతో కొత్త వెలుగుల అక్షర దీపాల్ని వెలిగించిన వాడు రామోజీరావు. సూటిగా స్పష్టంగా వుండే సరళమైన తెలుగుతో సామాన్యుణ్ణి కూడా చదివించే భాషతో, కదిలించే శైలితో సమ్మోహన పరిచింది ఈనాడు. అదే ఈనాడుతో రాష్ట్ర మంత్రులకీ, ముఖ్యమంత్రులకీ నిద్రలేని రాత్రుల్ని ప్రసాదించిన వాడూ రామోజీరావే! స్పష్టమైన చూపున్న ఆధునిక పెట్టుబడిదారుడు. హృదయంలేని వ్యాపారస్తుడు. అక్షరాలా అచ్చమైన తెలుగు రాక్షసుడు!

నందమూరి తారక రామారావుని గెలిపించిందీ, లక్ష్మీపార్వతీసమేత ఎన్టీఆర్ ను ఓడించిందీ చివరిదాకా పీడించిందీ రామోజీరావే కావడం... దాన్ని మనం గుడ్లప్పగించి చూడటం ఎంత విచిత్రం.

నాకు తెలిసి, రామోజీరావు ఎప్పుడూ తన ఫొటో ఈనాడులో వేయడానికి ఒప్పుకోలేదు. "నా పేపర్లో నా ఫొటో ఏంటయ్యా!" అనేవాడు. ఆయన తల్లి లేదా తండ్రి చనిపోయినపుడు (సరిగా గుర్తులేదు), ఒక సీనియర్ జర్నలిస్టు "మీ అమ్మగారి ఫొటో వేసి, వార్త యిద్దాం" అన్నాడు. "మా అమ్మ చనిపోతే యీ రాష్ట్రానికి వార్త ఎలా అవుద్దీ. వద్దు. అలాంటిదేం చేయకండి" అని రామోజీ అన్నారని నాకు తెలుసు. "సభలో పెద్దల గలభా" అని హెడ్డింగ్ పెట్టినందుకు అరెస్టు చేయమని ఐపీఎస్ అధికారి విజయరామారావును సభాధ్యక్షుడు ఆదేశించారు. రామోజీని అరెస్టు చేసేందుకు విజయరామారావు ఈనాడుకు వచ్చిన ఫొటోని మొదటి పేజీలో వేశారు. ఆ మాత్రం సెన్సూ, బేలన్సూ వున్నవాడాయన! రామోజీరావు తన సైన్యంతో గుర్రాల మీద గోబీ ఎడారిలో తూనీగల్లా దూసుకుపోతున్న వయసులో... దయలేదు... దాక్షిణ్యమూ లేదు, యుక్తా యుక్త విచక్షణ లేదు, పగ.. పగ... అనే కృష్ణపాండవీయం డైలాగు గుర్తొచ్చేది నాకు. విజయం అనే పంతం నెగ్గించుకునే దాకా నిద్రపోని వాడే రామోజీరావు.

సరదాకి- రామోజీకీ, నాకూ చిన్న పోలిక చెబుతా. మా యిద్దరి మధ్యా పెద్ద తేడా ఏం లేదు. మార్గదర్శి, ఈనాడు, ఫిల్మ్ సిటీ నాకు లేకపోవచ్చు. కానీ నా లాగా ఆయన కవిత్వాన్ని ఎంజాయ్ చేయగలడా? చెలాన్నో, చేగువేరానో పదే పదే చదువుకుని పరవశించిపోగలడా? లేదు. ఆయన ట్రాక్ వేరు. నాకు యిద్దరు మగపిల్లలు. ఆయనకీ యిద్దరు అబ్బాయిలు. నా పెద్ద కొడుకు నిత్యా నాదెండ్ల అయిపోవాలనీ, రెండో వాడు అతి సుందర పిచాయ్ కావాలనీ నేను నని కల లేదు. ఏలూరు నుంచి నడిచొచ్చిన నాలాంటి వలస కూలీ గాడికే ఇన్ని కలలుంటే రాజాధిరాజ, రాజమార్తాండ శ్రీమాన్ చెరుకూరి రామోజీరావు ప్రభువులకు కనీసం వంద వైల్డ్ డ్రీమ్స్ అన్నా వుండవా? వుంటాయి. వుండితీరతాయి.

**జాగ్రత్తగా వినండి. ఇదో మేజర్ ఇష్యూ.**

మనలాంటి వాళ్లం అంటే మధ్య తరగతి వాళ్లం.. అనగా యింటద్దె కట్టడానికి వెతుక్కునే వాళ్లం... సాయంత్రాలు డాబా మీద చాప వేసుకుని తలకింద చేతులు పెట్టుకు పడుకుని నీలాకాశం, మబ్బులూ చూస్తూ ఆనందిస్తాం. నెలవంకనీ, తొలి నక్షత్రాన్నీ చూసి పరవశించిపోతాం. రామోజీరావు ప్రోబ్లం ఏమిటంటే, చేత్తో ఆకాశాన్ని అందుకుందాం అనుకుంటాడు. అందకపోయిందా, దాన్ని కొనేద్దాం అనుకునే రకం. అందనిదేదో తన సొంతం అయ్యేదాకా నిద్రపోడు! పంతం మనిషికి. పుడుం పట్టుదల!

ఒక రోజు హైద్రాబాద్ ఈనాడు ఆఫీసులో గజ్జెల మల్లారెడ్డితో రామోజీరావు ఇలా అన్నారు. "మల్లారెడ్డీ, నేను గనక కమ్యూనిస్టు రష్యాలో వుంటే, ఏమయ్యేవాణ్ణి? మాస్కో శివారులోని ఒక పెద్ద ఫ్యాక్టరీకి చిన్న మేనేజరుగా... అంతేగా!" అన్నారు. మార్గదర్శి, ఈనాడు అనే మహా సంస్థల్ని స్థాపించే అవకాశం అక్కడ నాకు రాదుగా అని రామోజీ ఫిర్యాదు. మల్లారెడ్డి నాకీ విషయం చెప్పారు. ఆ ఫీలింగ్ తో నేను కూడా ఐడెంటిఫై అయ్యాను. ఈనాడులో నేను గనక జాయిన్ అయివుండకపోతే, ఏ దిక్కు మాలిన సంస్థలో క్లర్కుగానో, ఘనత వహించిన ఒక బ్యాంకులో గుమస్తాగానో.... చెహొవ్ కథలోని భయస్తుడిగా మిగిలిపోయేవాణ్ణి. అందుకైనా నేను ఆయనకి కృతజ్ఞుణ్ణి. 'ఉదయం' పత్రిక వస్తుందన్న మోజులో, పతంజలి తిరుపతిలో ఈనాడుకి రిజైన్ చేశారు. అక్కడి మేనేజరు గోవిందరావు నన్ను పిలిచారు. రామోజీరావు ఫోన్ చేశారు. మిమ్మల్ని వుండమని, తన మాటగా చెప్పమన్నారు. అయినప్పటికీ.. ప్రకాష్ రాజీనామా చేస్తే- వెంటనే ఆమోదించమన్నారు. దయచేసి నా మాట వినండి. మీరు వుండండి. ఛైర్మన్ గారు ఎవరి గురించీ నాకిలా చెప్పలేదు" అని ప్రాధేయపడుతున్నట్టుగా వివరించారు. పతంజలి అంటే యిష్టమూ, స్నేహమూ, గౌరవం వల్ల... ఆ క్షణంలోనే రాజీనామా చేసి వచ్చేశాను. బైటికి వచ్చేశాక తెలిసొచ్చింది, అక్కడ ఎంత సుఖంగా, గౌరవంగా బతికామో! ఇది నా సొంత ట్రాజెడీ! అటువైపు, అనగా రామోజీరావు కోణం నుంచి చూసినపుడు ఆయనకే విషాదమూ లేదా?.... అది కూడా చూడాలిగా!

Loneliness at the top అంటారుగా.... 83 సంవత్సరాల వయసున్న ఇప్పటి రామోజీరావు మానసిక స్థితి ఏమిటో! Autumn of the patriarch నవల్లో గాబ్రియేల్ గార్షియా మార్క్వెజ్ మొత్తం అధికారాలన్నీ ఒక నియంత చేతుల్లో వుండిపోవడం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి రాశారు.

ఈ పెద్ద వయసులో... జీవిత చరమాంకంలో... ఫిల్మ్ సిటీలో... ఏ పదో అంతస్తులోనో అద్దాల గదిలోంచి దూరాకాశాన్ని చూస్తూ తనలో తాను ఏం మాట్లాడుకుంటాడు? సిరిసంపదలూ, భోగభాగ్యాలూ హంసతూలికా తల్పాలూ...ఇవన్నీ సరే, ఎందుకింత తాపత్రయ పడ్డాను? ఎందుకిన్ని ఉరుకులూ, పరుగులూ! నేను పోగు చేసిన అపార ధనరాశుల కొండల్ని యిపుడు నేనే ఎక్కలేను కదా! ఇలాంటి విచారమే మిగుల్తుందా? లక్షల మందికి ఉద్యోగాలిచ్చి, వేల కుటుంబాల్ని నిలబెట్టానన్న సంతృప్తి ఓదారుస్తుందా?

చీకటి ఆకాశంలో ఒంటరి నక్షత్రాన్ని చూస్తున్నపుడు ఆయనకు ఏమనిపిస్తుంది?

రాబోయే తరాలు రామోజీరావనే విజేతని ఎలా గుర్తు పెట్టుకుంటాయో!

ఒక నార్ల వెంకటేశ్వరరావుని తలుచుకున్నట్టు...

ఒక చంద్ర రాజేశ్వరరావుని స్మరించుకున్నట్టు...

ఒక దేశోద్ధారక నాగేశ్వరరావు పంతుల్ని గుర్తు చేసుకున్నట్టు...

తనను జ్ఞప్తి చేసుకోవడం జరిగే పనేనా?

రామోజీరావు ఫిల్మ్ సిటీ అద్దాల మేడలోంచి చూసినట్టుగానే... ఆనంద్ నగర్ కాలనీలో మా అద్దెయింటి బాల్కనీలోంచి పున్నాగపూల చెట్టుని చూస్తున్నపుడూ... నాకో సందేహం! ఒక కఠోర దీక్ష పాటించిన అయ్యప్పస్వామి భక్తుడు శబరిమలై వెళ్లి మొక్కు చెల్లించుకుని తిరిగి వస్తూ అనుభవించే పవిత్రమైన ఆనందం రామోజీరావుకి ఎప్పుడైనా దొరికిందా? శ్రీకాకుళం జిల్లాలో మారుమూల గ్రామం నుంచి ముగ్గురు పిల్లల్తో రైలెక్కిన నిరుపేద భార్యాభర్తలు, దుర్భరమైన ప్రయాణం చేసి, బిడ్డల్ని ఎత్తుకుని, తిరుమల కొండ నడిచి ఎక్కి, తలనీలాలు సమర్పించి, కోనేట్లో స్నానం చేసి, భగవంతుణ్ణి దర్శించుకున్నపుడు ఆ నిరక్షరాస్యులు పొందిన అనిర్వచనీయమైన మనశ్శాంతి రామోజీకి ఎప్పుడైనా అనుభవంలోకి వచ్చి ఉంటుందా? ఈ సుదీర్ఘ కల్లోల జీవనయానంలో నిజమైన, నిరాడంబరమైన ఆనందాన్ని రామోజీరావు పొందగలిగారా...? నాకు అనుమానమే.

మరిచిపోలేని నా పుట్టిన రోజు: 1979గానీ 80గానీ కావచ్చు. విశాఖపట్నం, నవంబరులో ఓ రోజు. అది నా పుట్టిన రోజు. అమ్మా, నాన్నా, ఒక అన్నయ్య, ఇద్దరు అక్కలు, నలుగురు చెల్లెళ్లూ ఉన్నా, ఇక్కడ నేను ఒంటరిగా మిగిలాను. ఏం బతుకో ఏంటో... అనుకుంటూ ఆఫీసుకు ఎర్లీగానే వెళ్లిపోయాను. టీ ఇచ్చే బాయ్ వచ్చి స్వీట్ ప్యాకెట్ అందించాడు. ఆనందం కట్టలు తెగింది. ఒక వెర్రి సబ్ ఎడిటర్ గాణ్ణి, వాడి పుట్టిన రోజునీ గుర్తు పెట్టుకుని యాజమాన్యం స్వీట్లు పంపించిందంటే, అతను రామోజీరావు కాదు, సాక్షాత్తూ వేయి చేతుల విష్ణుమూర్తే అనుకున్నాను. ఇంతలో ఇతర జర్నలిస్టులు న్యూస్ ఎడిటర్ తెన్నేటి కేశవరావు వచ్చారు. వాళ్లందరికీ కూడా స్వీట్లు ప్యాకెట్లు పంచారు. ఇది కదా అదృష్టమంటే అని మురిసిపోయాను. అంతలోనే, ఇవ్వాళ నవంబరు 16 కదా, ఛైర్మన్ గారి పుట్టిన రోజు అని కేశవరావు చెప్పారు. నోరు మూసుకుని, ఏడేళ్ల బాలికపై యజమాని అత్యాచారం లాంటి పనికిమాలిన వార్తేదో రాసుకుంటూ... మనసులో నా కలలు కూడ దోచుకునే దొరలు ఎందుకు అని పాడుకుంటూ... హు... నవంబరు 16 !!

**తాడి ప్రకాష్ 9704541559**

# మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ను సత్కరించిన అనకాపల్లి తెలుగుదేశం నేతలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుని విజయవాడ ఆయన నివాసంలో అనకాపల్లి మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, విశాఖ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావుకలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన శ్రీ నూకంబికఅమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగా గడిచిన 5 ఏళ్లలో తెలుగుదేశం పార్టీ విజయం కోసం చేసిన కృషినీ కొనియాడారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో, తెలుగుదేశం పార్టీ విజయం కోసం, మరియు కూటమి అభ్యర్థులని గెలిపించడంలో మీరందరూ చేసిన కృషికి త్వరలో తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రామారావు, దాడి బుజ్జి, యల్లపు శ్రీనివాస్, పి సురేష్ చౌదరి, వేగి కృష్ణ, ఎస్. భానుచందర్, రమేష్, జొన్నాడ సురేష్, ప్రసాద్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# పాలు

ఒకసారి "పాలు" ఈశ్వరుని గురించి తపస్సు చేసింది. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యేక్షమై ఏమి నీ సమస్య అని అడిగాడు.

అప్పుడు పాలు.

ఈశ్వరా !!

నేను ఆవు నుంచి, బర్రె నుంచి వచ్చినప్పుడు శుద్ధంగా, పరిశుద్ధముగా ఉంటాను.. అయితే ఈ పాపిష్టి మానవుడు వాడి స్వప్రయో జనము కోసం నాలో పులుపు వేసి నా మానసును విరిచేస్తున్నాడు. నన్ను రక్షించు అని చెప్పి భాదపడిందట.

అప్పుడు ఈశ్వరుడు ఓ చిరు నవ్వు నవ్వి...

ఓ క్షీరమా... ఇది విను, నీవు పాలు లా జీవించాలి అని ఆశ పడే ముందు నా మాట విను.. నీవు పాలు లాగా అయితే ఒకరోజు మాత్రమే బ్రతుకుతావు.

పాలకు పెరుగు తోడు వేస్తే రెండు రోజులు బ్రతుకుతావు.,

పెరుగుని చిలికి చల్ల ని చేస్తే పుల్లపుల్లగా ఇంకో రెండు రోజులు బ్రతుకుతావు.

అదే చల్ల లోంచి వచ్చిన వెన్న అయితే వారం రోజులు బ్రతుకు తావు, అ వెన్నను బాగా కాచి దాంట్లో రెండు తమలపాకులు వేసి నెయ్యి చేస్తే మంచి ఘుమ ఘుమలతో నెలలు తరబడి బ్రతుకుతావు.

ఆ నెయ్యితోనే దీపం పెడితే నాకు అర్పణవు అవుతావు..

ఇప్పుడు చెప్పు... ఒక రోజు పాలు లాగా ఉండి పాలలాగానే చస్తావా లేక క్షణక్షణం అనుక్షణం, రోజు రోజూ పెరిగి రూపాంతరం చెంది నాకు అర్పణవు అవుతావా... అని ఈశ్వరుడు ప్రశ్నించారు..

దేవుని మాటకి "పాలు" మూగబోయింది, ఈశ్వరునికి దాసోహం అయ్యింది. తన మనసులో ఉన్న అంధ కారానికి సిగ్గుపడి బయటకు వచ్చింది. ఈశ్వరుడు ముందు ప్రజ్వలించి దీపంలా నిలిచిపోయింది...

మానవుడు కూడా అట్లాగే.. ఎవరో తమ మనస్సుని విరిచేసారు అని మనస్సుని పాడుచేసుకుని బాధపడేకంటే.. క్షీరము వలె మనస్సు లో ఆధ్యాత్మికత అనే తోడు వేసి, ప్రతి పరిస్థితులలోనూ ఆ ఆధ్యాత్మికతను ఈశ్వర నామ స్మరణతో చిలికి , దానిని దైవ చింతనం తో కాచి, దానిలోంచి వచ్చిన జ్ఞానం తో ఎప్పుడు ఎప్పుడా అని ఆ ఈశ్వరుని లో ఏకమవటానికి ఎదురు చూస్తూ జన్మను సార్థకం చేసుకోవాలి.

# పుత్రోత్సాహం

"అమ్మా ! నువ్వు ఇలా నిర్లిప్తంగా కూర్చుని ...నీ ప్రమేయం లేదు అన్నట్టుంటే ...నాకు కాళ్ళు చేతులు ఆడటం లేదు! నాన్నలేని లోటు పూరించడం కష్టమే కానీ, నీ మౌనం భరించడం ఇంకా కష్టంగా ఉంది! అన్ని ఏర్పాట్లు చేసినా ఇంకా ఏదైనామిస్ అయ్యామేమోనని మనసు పీకుతోంది. 12వ రోజు సమారాధన కోసం నాన్నకు ఇష్టమైన ఐటమ్స్ కొన్ని పురమాయించాను! నువ్వు కూడా కొన్ని విషయాలు చెప్తే నాకు బాగుంటుంది!"

కొడుకు సురేంద్ర మాటలకు దీర్ఘంగానిట్టూర్చింది వర్ధని!

"నాకేం తెలుసురా ఏం చెప్పాలో !ఇన్నాళ్లు నాన్న ఏది చెప్తే అదే మనం చేసాం. ఆయన ఈ లోకాన్ని విడిచి పోయినా ఆయన ఇష్టాయిష్టాలు ఇంకా నువ్వు గౌరవిస్తున్నావ్ అంటే, అది మా పూర్వజన్మ సుకృతం! నీకు ఏది బాగుంది అంటేఅదే చెయ్యి నాయనా!"

"ఆయనతోనే నా జీవితం అయిపోయింది. 45 ఏళ్ల దాంపత్యంలో చిన్నపిల్లలా ఆయన చిటికెన వేలు పట్టుకుని తిరుగుతూనే ఉన్నాను. ఆయన ఏది మంచిది అంటే అదే చేశాను. నాకంటూ ప్రాథమ్యాలు, ప్రాధాన్యతలు ఉంటాయనికూడా నాకు తెలియదు! సుమంగళి గా ఉండాలని పూజలు చేశాను, నోములు నోచాను. ఇహ ఆ భాగ్యం లేకుండాపోతోంది !నన్ను బోడమ్మను చేసి ఇంట్లో కూర్చో పెడతారు! ".. ఆఖరి మాటలు అంటుంటే దుఃఖం తన్నుకొచ్చింది వర్ధనికి!

తల్లి మాటలకు కలతచెంది ఆర్ద్రతతో ఆమె తలను తన చేతులతో చుట్టి, గుండెకు పొదువుకున్నాడు కొడుకు!

"నాన్నలేకపోతే ఏంటమ్మా నేనున్నాను కదా నీకు! నేను అన్నీ చూసుకుంటాను !బెంగ పడకు!"... అంటూ మాటిచ్చాడు సురేంద్ర!

బంధుమిత్రులు, ఇరుగుపొరుగు లు ఎంత ముఖం చిట్లించినా.. తన తల్లి తన మంగళ చిహ్నాలను తీయడం లేదనిసుస్పష్టం చేశాడు!. ఎందుకో ఆమెకే మనసొప్పక మంగళసూత్రాలు, నల్లపూసలు, మట్టెలు తీసేసింది వర్ధని!

తల్లిని దర్జాగా తీసుకువచ్చి తండ్రి కూర్చునే సోఫా లో కూర్చోబెట్టాడు సురేంద్ర! వచ్చినవారు చేసేదిలేక కాస్త జీలకర్ర నోట్లోవేసుకుని , ఆమెను పలకరించి భోజనాలకు లేచారు!

సురేంద్ర అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్ గా ప్రభుత్వంలో ఉన్నత పదవిలో ఉన్నాడు. అతనితో పనులు చేయించుకున్న వారు, పనులు ఉన్నవారు , ఉపకారాలు పొందినవారు అతని దృష్టిలో పడడానికి...ఇదో ఒక మంచి అవకాశంగా భావించారు! బస్తాలతో కూరలు బుట్టల తో పళ్ళు డబ్బాలతో నేతి స్వీట్లు, మిఠాయిలు, కేన్ల కొద్దీ పాలు, పెరుగులు నెయ్యిలు, బస్తాలతో బియ్యం, అపరాలు ఒక్కటేమిటి అవసరానికి మించి వంద రెట్లు తెచ్చిపడేసారు ఇంటినిండా!

ఎవరేంటి తెచ్చినా కాదనలేదు సురేంద్ర! పరోక్షంగా అవి కొందరు అసహాయుల పోషణార్థం పనికి వస్తాయను కున్నాడు!

దాన ధర్మాలు, బ్రాహ్మణ దక్షిణలు భూరిగా ఇచ్చుకుని.. నలుగురు 'ఆహా' అని అనుకునే లాగా పూర్తిచేశాడు పితృకార్యాన్ని సురేంద్ర! ఇంటి పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్ లో వెయ్యి మందికి పైగా సంతర్పణ భోజనం చేశారు! మరో వెయ్యిమందికి వండించి, శివార్లలో ఉన్న వృద్ధాశ్రమాలకు పంపించాడు సురేంద్ర! మిగిలిన సామానులు...కొంత విరాళం జోడించి..పిల్లలహోమ్ కు పంపేసాడు!

రెండు రోజుల్లో బంధువుల నిష్క్రమణతో ఇల్లు ఖాళీ అయిపోయింది! సెలవు అయిపోవడంతో కూతురు ఢిల్లీకి ప్రయాణం కట్టింది! వెళ్లేముందు పదేపదే తల్లి చుట్టూ తిరుగుతూ..." నాన్న నా గురించి ఏదైనా చెప్పారా ? నువ్వు చెప్పాల్సింది ఏమైనా ఉందా అమ్మా.. " అంటూ అన్యాపదేశంగా ఏదో అడగాలని ప్రయత్నిస్తోంది! తల్లిని తనతో రమ్మని అడిగే ధైర్యం ఆమె చేయలేకపోతోంది!

ఆ మహానగరంలో తల్లికి అదనపు సౌకర్యాలు కలగజేసే పరిస్థితులు ఆమెకు ప్రస్తుతం లేవు! పైగా కొండంత కొడుకు అండ వదిలి తల్లి తనతో వస్తుందన్న ఆశ కూడా , ఆమెకు లేదు!

వర్ధనికి కూతురు అంతర్యం అర్థమయ్యింది! కోడల్ని పిలిచింది! "స్వర్ణా! లాకర్ లో ఉన్న నా బంగారాన్ని నువ్వు సగంతీసుకుని, మిగిలిన సగం మీ ఆడపడుచు కియ్యి".. అంటూ బ్యాంకు లాకరు తాళం కోడలు చేతిలో పెట్టింది!

"బంగారంలో సగమే అంటే.. ఈ ఇంట్లో కూడా నాకు సగం ఇచ్చి తీరాలి".... అంటూ... మొహం గంటు పెట్టుకుంది కూతురు ధరణి!

వర్ధని జవాబిచ్చే లోగానే, సురేంద్ర అక్కడ ప్రత్యక్షమయ్యాడు! "స్వర్ణా! అమ్మ కు తాళం ఇచ్చేసేయ్! ధరణి! అమ్మ ఇప్పుడుబంగారం పంచేసేది ఏమీ లేదు! అవన్నీ అమ్మకు కావాలి! నాన్న పోవడంతో, అమ్మ జీవితమేమీ ముగిసిపోలేదు! ముందు ముందు... తన చేతుల మీద జరగాల్సిన శుభకార్యాలు ఉన్నాయి! ఈ ఇల్లు కానీ, ఈ నగలు కానీ అమ్మ తనచివరి క్షణం వరకు అనుభవించి ..తన తదనంతరం ఆమె కోరుకున్న వారికి ఇచ్చే హక్కు... పూర్తిగా తనదే! ఢిల్లీలో నీ ఫ్లాట్ కోసం పదేళ్ల క్రితమే డబ్బు తీసుకున్నావు! ప్రస్తుతం అమ్మకు మిగిలి ఉన్న ఈ కాస్త ఆస్తి మీద ఎక్కువ ఆశలు పెట్టుకోకు! ఇంటి ఆడపిల్లగా నీకు న్యాయమే చేస్తాం! నీ పుట్టింటి మీద నీకున్న హక్కులన్నీ అలాగే భద్రంగా ఉంటాయి! ఆనందంగా వస్తూ పోతూ... పసుపు కుంకుమలు తీసుకుని వెళ్ళు! అమ్మని మాత్రం బాధ పెట్టొద్దు ఏవిధంగానూ!" కాస్త గట్టిగాచెప్పాడు సురేంద్ర!

పక్క గదిలో పెట్టెలు సర్దుకుంటున్న అల్లుడికి ఈ మాటలన్నీ వినిపిస్తూనే ఉన్నాయి! వచ్చినప్పటి నుండి చూస్తున్నాడు. సురేంద్ర ఎంత శ్రద్ధగా పితృకార్యం చేసాడో, ఎంత ఆత్మీయంగా తల్లినీ, ఇతర బంధువులనూ ఆదరిస్తున్నాడో! తల్లి పట్ల సురేంద్ర చూపిస్తున్న ప్రేమ... తన నిబద్ధతను నిలదీసినట్టు గా అనిపించింది అల్లుడికి!

ఉద్యోగంలోనూ, హోదా లోను, ఆస్తి లోనూ సురేంద్ర కు ఏ మాత్రం తక్కువ కాదు తను! కానీ తండ్రి పోయినపుడు అపరకర్మలన్నీ "మమ" అనిపించి, గయలో పిండం పెట్టి చేతులు దులుపుకున్నాడు! ఒక్కగానొక్క కొడుకు గా తన తల్లినిఆదరించక పోగా, అన్ని వసతులు ఉన్న రిటైర్మెంట్ హోమ్ లో పెట్టి తన బాధ్యత తీరింది అనుకుంటున్నాడు! భార్య చేతిలో తోలు బొమ్మలా ఆడుతూ తల్లిని దూరం చేసుకున్నాడు తను!

ఈరోజు సురేంద్ర మాటలు వింటుంటే, అతనిలో..మాతృ వాత్సల్యం నిద్ర లేచింది ! ఏదో దిశానిర్దేశం జరిగినట్లు అనిపించింది!

దిగ్గున లేచి పక్క గదిలోకి వెళ్ళాడు! సురేంద్ర భుజంమీద స్నేహంగా చేతితో తట్టి, "సురేంద్ర నువ్వు చెప్పింది అక్షరాలనిజం ! నీ లాంటి కొడుకు ఉంటే ఏ తల్లి అయినా భర్త లేకపోయినా నిబ్బరంగా గుండెల మీద చెయ్యి వేసుకుని బ్రతకగలదు! చెప్పాలంటే ధరణికి ఏమి లోటు లేదు! ఇలా తండ్రి పోయిన వెంటనే పుట్టింట్లో తన హక్కులను సాధించుకోవడం అంత మంచి పని కాదు! తన తరఫున నేను క్షమాపణ చెప్తున్నాను! అత్తయ్య గారు! మీరు ఎలాంటిబెంగ పెట్టుకోకుండా హాయిగా ఆరోగ్యంగా ఉండండి ! మేము ప్రతి రోజు మీతో మాట్లాడుతూ ఉంటాం! ఏ అవసరం వచ్చినా, ధరణి మీకు సహాయంగా వస్తుంది! ఇది నా మాటగా తీసుకోండి!".. మనసు నిండుగా, ఆదరంగా మాట్లాడిన అల్లుడినిచూసి చాలా నిశ్చింతగా అనిపించింది వర్ధనికి!

మర్నాటి కల్లా ధరణి వెళ్ళిపోయింది! తల్లికి... తమ ఇంట్లో ..గాలి , వెలుతురు ధారాళంగా వచ్చేటటువంటి మంచిగదిని అన్ని సౌకర్యాలతో... తయారుగా ఉంచమని ...స్వర్ణను, పిల్లలను ఇంటికి పంపేసాడు సురేంద్ర! తల్లి కొడుకుల మాత్రమే మిగిలారు ఆఇంట్లో! ఆ రాత్రంతా తండ్రి స్మృతులను తల్లి తో వల్లె వేశాడు సురేంద్ర! మౌన శ్రోతగా అన్నీ వింటూకూర్చుంది వర్ధని! ఆ స్మృతులలో వీలయినన్ని మంచివే ఏరి మాట్లాడుతూ ఎన్నో చేదుజ్ఞాపకాల ప్రసక్తే తేని కొడుకు సంస్కారానికి ముగ్ధురాలయింది ఆమె!

ఆమె మరో ప్రస్థానంలో మొదటి ఉషోదయం అయ్యింది! ఆరింటికి తల్లి ఇచ్చిన కాఫీ తాగి.. "అమ్మా! కావలసినవన్నీ సర్దేసు కొన్నావు కదా! మరో గంటలో బయలుదేరాలిమనం! ఈరోజు నేను ఎట్టి పరిస్థితుల్లో నైనా ఆఫీస్ లో జాయిన్ అవ్వాల్సి ఉంది! "... అన్నాడు సురేంద్ర!

కొన్ని క్షణాల మౌనం తరువాత...." నేను కొన్నాళ్ళు ఇక్కడే , మన ఇంట్లో ఉందామని అనుకుంటున్నానురా! ఇల్లుపాడుపెట్టడం నాకు ఇష్టం లేదు"... తడబడుతూ చెప్పింది వర్ధని కొడుకుతో!

"ఇల్లేమీ పాడవదు అమ్మా! పని వాళ్ళని పంపి బాగు చేయిస్తూ ఉంటాను! నువ్వు ఒక్కతివే ఒంటరిగా ఇక్కడ ఉండలేవు !నాన్న జ్ఞాపకాలు నిన్ను వదలవు! నువ్వు మాతో ఉండడమే సరి ! నాకు కూడా చాలా నిశ్చింతగా ఉంటుంది!" అన్నాడు సురేంద్ర!

"లేదు నాన్నా.. నన్ను అర్థం చేసుకో! నేను ఉండగలను! కొత్తమార్పులను వెంటనే తీసుకోలేను! నాకు కొంచెం సమయంకావాలి! ప్లీజ్!".... అంటూ బేలగా అభ్యర్థించింది కొడుకును!

బేలగా అన్నా... తల్లి మాటల్లోని దృఢత్వాన్ని గుర్తించాడు అతను! తన మాటలతో ఆమె నిర్ణయం వీగిపోదని అర్థంఅయింది! ఎక్కువ రెట్టించకుండా

"సరే అమ్మా! నీ ఇష్టం! ఏ అవసరం ఉన్నా క్షణాల్లోనే నీ ముందుంటా!" అని, తల్లికిమాటిచ్చి సురేంద్ర కూడా వెళ్ళిపోయాడు!

ఇల్లు ఇప్పుడు పూర్తిగా ఖాళీ అయిపోయింది! పెద్దగా దిగులు అనిపించలేదు వర్ధనికి! తోటలోకి వెళ్ళింది. అడ్డదిడ్డంగాపెరిగి, వ్యాపించిపోయిన కొమ్మలతో...

రకరకాల మందారాలూ, నిత్యమల్లిచెట్లు, వందేళ్ళనాటి ఫలసాయంలేని చెట్లు... తోటంతా నీడలు పరుస్తూ! ఆ చెట్ల వలన ఇరుగుపొరుగులతో శాశ్వత శతృత్వాలు! అయినా మారని భర్త మొండివైఖరి తలుచుకుని భారంగా నిశ్వసించింది వర్ధని.

ఎంత విచిత్రమయిన మనిషో ఆయన. తా పట్టిన కుందేటికి మూడేకాళ్ళు అనే వ్యవహారం! పురాతనమయిన భావాలూ, ఆచారాలు! పొదుపు పేరిట అతికూడిక... ఇంటి ఆడపడుచులకు కూడా పూచికపుల్ల ఇవ్వనంత! అత్తగారి ఇత్తడి సామాన్లు, రాచ్చిప్పల్లో వంట. పెళ్ళయిన ఇరవై యేళ్ళకు వరకూ కుంపటి వంటే! ఆరోగ్యం పేరు చెప్పి పత్యపు తిండి. నెలకు కేజీ నూనె వాడకం కూడా ఎక్కువే! తన పుట్టిల్లు మధ్యతరగతయినా... సుష్టుగా అన్ని ఆధరువులతో భోంచేసే భోజనప్రియులు! "

"కొడుకు చేతికందే వరకూ ..ఏడాదికి మూడుచీరలే! పోనీ లేదా పోదా అంటే.. ఎగువమధ్యతరగతి నేపథ్యం. మంచి జీతమొచ్చే ప్రభుత్వ ఉద్యోగం! తన అభిప్రాయాలసాధనలో ఒకరకమైన నిరంకుశత్వం ఆయనది! తనకంటూ బంధువులూ, స్నేహబాంధవ్యాలూ నెరిపే అవకాశం ఇవ్వకుండా... ఇంటిని పుస్తిని చేసిన మహానుభావుడు ఆయన!"

"మెరిట్ లో మెడిసిన్ లో సీట్ తెచ్చుకున్న సురేంద్రను , డాక్టర్ అవ్వడానికి పదేళ్ళు పడుతుందని, మెడిసిన్ చెయ్యనివ్వకుండా, బలవంతంగా

బీ. ఫార్మసీ లో పెట్టారు. ఇరవై యేళ్ళకే ఇంట్లోంచి బయటకెళ్ళిపోయి, స్కాలర్ షిప్స్, పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ, తండ్రి నుండి ఆర్థికసహాయం ఆశించకుండా ఎంతో పైకి వచ్చాడు కొడుకు. తండ్రి దూరంచేసుకున్న బాంధవ్యాలను తన ఆత్మీయతతో దగ్గర చేసుకున్నాడు. తను జీవితంలో ఎదుగుతూ, ఎందరికో చదువులకూ, ఉద్యోగాలకూ చేయూతనిచ్చాడు. "

"చెప్పాలంటే కొడుకుని చూసే ఇప్పుడు తమను బంధువులు గౌరవించే స్థాయికి , నైతికంగా , సామాజికంగా ఎదిగాడుసురేంద్ర! కూతుర్ని నెత్తిమీద దేవతలా చూస్తూ, ఆడింది ఆట పాడింది పాటగా సాగించి, కొడుకును మాత్రం ఆంక్షల సంకెళ్ళతో అనుక్షణం క్రమశిక్షణ పేరిట దండిస్తూ, అవమానిస్తూ ఉన్న తండ్రికి ఎప్పుడూ గౌరవం తక్కువ చెయ్యలేదు ! తండ్రి మూర్ఖత్వం, నిరంకుశత్వం వలన తను ఎన్నో కోల్పోయినా, ఒక్కరోజూ తండ్రిని ద్వేషించలేదు! ఆయన ఇన్నేళ్ళకు కళ్ళుతెరిచి, వాడి మంచితనం అర్థమయ్యి, కాస్త మృదుత్వం అలవాటుచేసుకుని, కొడుకుతో అనుబంధం పెంచుకునేసమయానికి ... మనిషే లేకుండా పోయారు! "....వర్ధని ఇలాంటి ఆలోచనలతోనే రోజులు గడిపేస్తోంది.

"ఇప్పుడు తనకు కావలసినది వండుకునే స్వేచ్ఛ ఉంది. కానీ తినడానికి మనసే లేదు. ఎక్కడికయినా వెళ్ళే స్వతంత్రంఉంది. కానీ ఎక్కడికెళ్ళాలో తెలీదు. "ఎంత పరాధీన తను! ".... వేము తిన్నంత చేదు ఆమె మనసులో! వారం కన్నాఎక్కువ ఉండలేకపోయింది ఆ ఇంట్లో ఒంటరిగా! దానికి పరిష్కారమూ సురేంద్రే చేసాడు.

మంచి ప్రణాళికతో... అన్ని ఏర్పాట్లూ చేసి, వర్ధనినీ, తమతోనే వుండే అత్తగారినీ, ధరణి అత్తగారినీ, ఇద్దరు మేనత్తలనూ కాశీ, ప్రయాగ, చార్ ధామ్, వైష్ణోదేవి యాత్రలకు పంపించే ఏర్పాటుచేసాడు!

భర్త పోయి నెలరోజులవ్వక మునుపే యాత్రలంటే లోకం నవ్వుతుందని... వర్ధని ససేమిరా అనేసింది. సురేంద్ర తల్లితోఒకటే అన్నాడు! "అమ్మా! జీవితం చాలా చిన్నది. ఇప్పటికే అరవైయేళ్ళు అసఫలంగా, పంజరంలో చిలుకలా గడిపేసావు. ఇక నుంచి ప్రతిక్షణం, నువ్వు కోల్పోయిన కాలాన్ని వెనక్కు తెచ్చుకోవాలి! చేద్దామనుకున్నవీ, చూద్దామనుకున్నవీ మొదలుపెట్టాలి! నీకు నేనున్నానమ్మా! జీవితం మళ్ళీ మొదలుపెట్టు!! వెళ్ళిపోయిన వారి గురించి వగస్తూ కూర్చుని లాభంలేదు" అంటూ తల్లికి ధైర్యం చెప్పాడు!

వర్ధనికి తన జీవితంలో రెండవ అధ్యాయం మొదలయ్యింది!

రెండునెలల యాత్రలు, మరో రెండునెలలు ధరణి దగ్గర గడిపాకా.... సంతృప్తి చెందిన మనసు, మొట్టమొదటిసారి లోకాన్ని చూసిన ఆనందం, తన చుట్టూ ఇంత నాగరికత ఉందా అన్న విభ్రమంతో తిరిగివచ్చింది వర్ధని.

ఇల్లు బాగుచేయిస్తున్నానని, తల్లిని తమింట్లోనే పెట్టాడు సురేంద్ర! స్వర్ణతల్లి విద్యావంతురాలు, మంచి క్రియాశీలకురాలు. వర్ధనికి ఓపిగ్గా వివరిస్తూ...ఫోన్ లో ఫేస్ బుక్, వాట్సప్ పరిచయం చేసింది. ఎందరో పరోక్ష మిత్రబృందాలతో, సాహితీసౌరభాలతో వెలుగులీనే ఫేస్ బుక్ వర్ధనికి చక్కని కాలక్షేపంగా మారింది.

కొడుకు సేకరించిన ఎన్నో అపురూపమైన పుస్తకాల నిధి మరో పెన్నిధి అయ్యింది ఆమెకు. భర్త తనలో పెంచి, పోషించిన నిర్లిప్తత, నిరాశ, విరక్తి.... మెల్లమెల్లగా కరిగి పోతున్నాయి! జీవితం నవనవోన్మేషంగా మారుతోంది. పిల్లలూ, పువ్వులూ, పుస్తకాలూ, పరిసరాలూ ఎన్నో నేర్పుతున్నారు!

తండ్రి సంవత్సరీకాలు కూడా ఎంతో శ్రద్ధగా పూర్తిచేసాడు సురేంద్ర! మాఘమాసం రాగానే, "రా అమ్మా! నీ ఇల్లు చూసుకుందువు గాని"... అంటూ వర్ధనిని బయలు దేరదీసాడు! ఆ వీధిలో బీటలువేసిన , నాచుపట్టిన గోడల్లోంచి రావిచెట్లు తొంగిచూస్తూ, అడవిలాంటి తోటతో , దిష్టిబొమ్మలా ఉండే తమ ఇల్లు- ఎంతో అందంగా, అధునాతనంగా, విశాలంగా తయారయ్యి ఉండడం చూసి, ఆమె సంభ్రమమొందింది. ముందుగా ఆమెను ఆకర్షించినది నందన వనంలాంటి తోట.

"అయ్యో! మామిడిచెట్లు, చింతచెట్లు ఏవిరా?".... అంది కొడుకుతో! "అమ్మా! నేను కొన్నిరోజులు వాటితో మాట్లాడానమ్మా, మీరు పెద్దవారయిపోయారు. మీవలన ఈ స్వార్థపూరిత అనాగరికులకు ఇబ్బందిగా ఉంది. మీ అనుమతితో మిమ్మల్ని తొలిగించవచ్చా! మీ కొమ్మలకు అంట్లు కట్టించి... నా తోటలో మీ వంశాన్ని కొనసాగిస్తా!".... అంటూ వాటిని ప్రార్థించేవాడినమ్మా! నమ్మూ, నమ్మకపో.... అవి రెండునెలల్లో వృద్ధాప్యం వచ్చినట్టు పూర్తిగా వడలిపోయి, మోడులయ్యాయి! అప్పుడే వాటిని కొట్టించి, ఆ కలపంతా మనింటికే వాడాను." అన్నాడు సురేంద్ర!

వర్ధనికి ఏమీఆశ్చర్యం అనిపించలేదు. కొడుకు అచ్చం తన పోలికే! కష్టమొచ్చినపుడు ఆ మాకులతోనే పంచుకునేది. అవి కూడా విన్నట్టేఉండేవి!

క్రింద మూడు, పైన మూడు అత్యంత సౌకర్యకరమైన పడకగదులు వేయించాడు. లేలేత భానుకిరణాలు పడుతుంటే ధ్యానం చేసుకోవడానికి అనువుగా చక్కని సన్ రూమ్ , తను కోరుకునే విధంగా.. విశాలమయిన పూజామందిరం, అందమైన తంజావూరు దేవతామూర్తుల పటాలతో మనోజ్ఞంగా చేయించాడు! అన్నిటికన్నా మిన్న వంటగది! మొత్తం అధునాతనంగా, సౌకర్యంగా! అనుకున్న పాంట్రీలో.... అన్ని వరుసల్లో... రకరకాల సైజుల్లో... అమర్చినస్టీలుడబ్బాలను, గాజుసీసాలను చూసి... వర్ధని కళ్ళలో మెరుపు, పెదాల మీద చిన్నచిరునవ్వు మెలిచాయి! ఇవన్నీ భర్తహయాంలో తన తీరని కోరికలు! సరుకులన్నీ చిన్నచిన్న పొట్లాలు కట్టించి, చెక్కబీరువాలో పెట్టించి తాళం వేసే వారాయన- తను దానధర్మాలు, దుబారా చేస్తుందని!

"నా కొడుక్కు అన్నీ తెలుసు తన గురించి! తన మనసులోని ప్రతి భావన, స్పందన, కోరిక, ఉద్వేగం...సమస్తం ఎరుకే ఈ పిల్లవాడికి!"... అనుకుంటూ

ఆ అమ్మమనసు పుత్రవాత్సల్యంతో ఉప్పొంగిపోయింది!

ఒక మంచిరోజు తల్లిని యజమానురాలి హోదాలో... గౌరవంగా ...తమజంటతో సమానంగా, పీటలమీద కూర్చుండపెట్టి గృహప్రవేశం చేయించాడు సురేంద్ర! తండ్రి తదనంతర ఆస్థులన్నీ తల్లి పేరిటకు మార్పించాడు! వర్ధని, స్వర్ణ తల్లితో పాటూ... ధరణి అత్తగారు కూడా ఆ ఇంటికే మారిపోయారు! ఇంట్లో పనులకు, వంటకు హెల్పర్స్ ను పెట్టాడు. వారికి సౌకర్యవంతంగా ఉండే విశాలమైన కారు కొని, డ్రయివర్ తో సహా, గుమ్మంలో పెట్టాడు! మేడమీద కు స్వర్ణా, పిల్లలతో... దిగిపోయాడు!

గృహప్రవేశం నాడు మేనత్తలు ముగ్గురినీ పిలిచి, వారు గతంలో అన్నగారిని అడిగి, భంగపడ్డ తమ తల్లిగారిబంగారం, మూడెకరాల భూమిపత్రాలు వారి చేతిలో పెట్టి,..." అత్తా! ఇది మీ అందరి ఇల్లూ కూడా! మీకు కావలసినన్నిరోజులు ఇక్కడకు వచ్చి విశ్రాంతి తీసుకోండి. మీకు ఏ అవసరానికయినా ఈ మేనల్లుడు ఉన్నాడని మర్చి పోకండి!".... అంటూ ఆప్యాయంగా చెప్తుంటే.... వాళ్ళు కన్నీటితో...పరమానందభరితులయ్యారు!

"వదినా! నీ కడుపున రాములవారే పుట్టారు వీడి రూపాన! మా అన్నయ్యకు ఈ పుత్రోత్సాహం చూసే యోగం లేదు. వీడిని రాముడని ఎందుకు అన్నామంటే, ఒకవేళ దశరథుడు , కౌసల్య తన తోనే ఉండివుంటే.. సంపద ఉన్నా, లేక పోయినా... అయోధ్యలో నయినా , అడవిలోనయినా రాములవారు తల్లితండ్రులను ... అదే ప్రేమతో, వైభవంతో, అక్కరతో... లోటనేది రానీయకుండా చూసుకుని వుండేవారు నీ కొడుకులా!"...అంటూ... ఆ కన్నతల్లి కడుపు సంతోషంతో నింపేసారు!

ఆ విధంగా తల్లికి స్వయంప్రతిపత్తిని కల్పించి, సాధికారంగా, స్వతంత్రంగా, స్వేచ్ఛగా బ్రతకడానికి మార్గం సుగమం చేసిపెట్టాడు సురేంద్ర! తల్లి మనసులో తండ్రిచేసిన ప్రతి అవమానాన్ని, ప్రతి గాయాన్ని తన బాధగా అనుభవించాడు అతను ఇన్నాళ్ళూ! తనకు శక్తి ఉన్నా... కొడుకు స్వార్జితంతో పూచికపుల్ల కూడా ముట్టననే తండ్రిఅసహనంతో, విచిత్ర వైఖరితో సర్దుకుంటూ...అతను పడ్డ మనక్షోభ ఇన్నాళ్ళకు ఉపశమించింది. ఆయనకు సజీవంగా ఏమీ చెయ్యలేకపోయినా, ఆయన మరణానంతరం ఆయన పేరిట పేదవిద్యార్థులకు స్కాలర్ షిప్, వృద్ధాశ్రమాలకు విరాళాలరూపంలో ఇస్తూ... పితృరీణం తీర్చుకుంటున్నాడు!

ఇది మలుపులున్న కథ కాదు! కానీ ఆదర్శవంతుడైన ఒక కొడుకు కథ! ఎందరో స్ఫూర్తిగా తీసుకోవలసిన ఒకనీతికథ! తల్లిదండ్రులు, సమాజం నాకేమిచ్చిందని... ప్రశ్నించకుండా... 'వీరికి నేనేమి చెయ్యగలను'... అని ఆలోచిస్తూ , బాధ్యతలు సక్రమంగా, సంతోషంగా నిర్వహిస్తూ, కార్యాచరణలో పెట్టే క్రియాశీలి కథ!

# తిరుమల శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు కుటుంబం



తిరుమల: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆయనకు తితిదే జేఈవో గౌతమి, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు. అఖిలాండం వద్ద చంద్రబాబు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమల పెద్ద జీయర్ మఠానికి వెళ్లి ఆశీర్వచనం తీసుకున్నారు. చంద్రబాబు వెంట ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాంశ్ ఉన్నారు. సీఎంను చూసేందుకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు తెదేపా కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు.

# పాడేరు ఘాట్ రోడ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధి పాడేరు దరి ఘాట్ రోడ్ లో హెయిర్ పిన్ బెండు 12 వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెదబయలు మండలంలో మోదకొండమ్మ అమ్మవారు జాతర ఈవెంట్ చేసుకొని తిరిగి హెవీ లోడ్ తో వస్తున్న పెద్ద వ్యాను అదుపుతప్పి లోయలో పడింది. జరిగిన ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 8 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. దీంట్లో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని ఇప్పుడు స్థానికులు సమాచారం. అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన ఎస్ ఎస్ వి ఈవెంట్స్, సౌండ్స్ అండ్ లైటింగ్ వారి ఆధ్వర్యంలో పెదబయలు మండలంలో మోద కొండమ్మ అమ్మవారి మహోత్సవాలు జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఈ సాంస్కృతిక కార్యక్రమాలు జరగగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆ ఈవెంట్ స్టేజ్ , సౌండ్ , లైటింగ్ మొత్తం విప్పుకొని ఈవెంట్ నిర్వాహకుడు తన సిబ్బందితో వ్యాన్ లో ఈ సరుకును తరలిస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో హరి(19), లక్ష్మణ్(21), అశోక్ కుమార్(21) లు అక్కడికక్కడే మృతి చెందారు.

అదే వ్యాన్ లో ప్రయాణిస్తున్న మరో ఎనిమిది మంది తీవ్ర గాయాల పాలయ్యారు. దీంట్లో రవి , ఏసు, పవన్, గణేష్, మోహన్, నితిన్, రోహిత్ లు ఉన్నారు. వీరికి చేతులు, కాళ్లు , నడుము తదితర భాగాలు విరిగిపోయినట్లు తెలుస్తోంది. వీరందరినీ అత్యవసర చికిత్స నిమిత్తం హుటాహుటిన కేజీహెచ్ కు తరలించారు. మృతులు ముగ్గురికి పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మృతులు, క్షతగాత్రులు అందరూ అచ్యుతాపురం పరిసర ప్రాంతాలకు చెందిన వారిని పోలీసులు తెలిపారు. వ్యాను బ్రేకులు ఫెయిల్ అవడం కారణంగా జరిగినట్లుగా భావిస్తున్న ఈ సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్రమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కిషన్ రెడ్డి, బండి సంజయ్



సికింద్రాబాద్ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బొగ్గు గనుల శాఖ మంత్రిగా, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హోం శాఖ సహాయ మంత్రిగా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. బొగ్గు మరియు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాకు 2శాఖల బాధ్యతలు ఇచ్చారని ఈ మేరకు ఈరోజు బొగ్గు మరియు మైనింగ్ శాఖల మంత్రిగా బాధ్యతలు తీసుకున్నానని ఆయన తెలిపారు.

**ప్రజల జీవితాల్లో విద్యుత్ రంగం చాలా కీలకమైంది: కిషన్ రెడ్డి**

ఈ శాఖలో గతంలో ప్రహ్లాద్ జోషి, పియూష్ గోయల్ వంటివారు పనిచేశారని, ఈ కీలకమైన శాఖలో ప్రస్తుతం తాను ప్రజలందరూ మెచ్చే విధంగా పనిచేయాలని భావిస్తున్నానన్నారు. ప్రజల జీవితాల్లో విద్యుత్ రంగం చాలా కీలకమైందని పేర్కొన్న కిషన్ రెడ్డి, పదేళ్లక్రితం దేశంలో తీవ్రమైన విద్యుత్ కొరత ఉండేదని, కరెంటు, నీళ్ల కొరత కారణంగా పంటలు ఎండిపోయిన పరిస్థితులను చూసామని, హైదరాబాద్లో పారిశ్రామికవేత్తలు ఆందోళనలు చేసిన ఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు.

**బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిపై ఫోకస్ చేస్తా: కిషన్ రెడ్డి**

అయితే పదేళ్ల కాలంలో మోడీ విద్యుత్ కొరతకు చెక్ పెట్టి, పరిశ్రమలకు, గృహాలకు, వ్యవసాయానికి సరిపోను కరెంటును అందిస్తున్నారన్నారు. దీనికి ప్రధానకారణం బొగ్గు అంటూ పేర్కొన్నారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి దేశంలో ఎక్కువగా జరుగుతుందని, రానున్నరోజుల్లో దీనిని మరింత ముందుకు తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్న ఖనిజ నిక్షేపాలను వెలికితీసి ఇతర దేశాలకు ఎగుమతి చేసి ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

**హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్**

శక్తివంతమైన భారత్ ను రూపొందించడానికి బొగ్గు, మైనింగ్ శాఖలు చాలా కీలక పాత్ర పోషిస్తాయని చెప్పిన ఆయన,ఈ శాఖలలో తన బాధ్యతను నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇదిలా ఉంటే సాదాసీదాగా బండి సంజయ్ హోమ్ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలను చేపట్టారు. సరిగ్గా 11 గంటలకు నార్త్ బ్లాక్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు బండి సంజయ్ కుమార్.

**హోంశాఖ సహాయ మంత్రిగా ప్రజా రక్షణ కోసం పని చేస్తా: బండి సంజయ్**

తొలిసారి కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతల కార్యక్రమానికి హాజరై వేద మంత్రోచ్చారణలతో బండి సంజయ్ కు జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఆశీస్సులు అందించారు . భద్రతా కారణాల రీత్యా కార్యకర్తల అట్టహాసం, నాయకుల సందడి లేకుండా అత్యంత నిరాడంబరంగా హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు తీసుకున్నారు. హోంశాఖ సహాయ మంత్రిగా తన బాధ్యతలను ప్రజల కోసం, ప్రజా రక్షణ కోసం నిర్వహిస్తామన్నారు బండి సంజయ్.

# మసకబారిన అంతర్జాతీయ ఇమేజ్‌ను కాపాడుకునేందుకు జీ7 సదస్సుకు మోడీ : జైరాం రమేష్



న్యూఢిల్లీ: మసకబారిన తన అంతర్జాతీయ ఇమేజ్‌ను కాపాడుకునేందుకే ప్రధాని నరేంద్రమోడీ జీ7 సదస్సుకు హాజరవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ విమర్శించారు. జీ 7 సదస్సుకు గతంలో 2007లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ వెళ్లిన విషయాన్ని జైరాం రమేష్ ఈసందర్భంగా ప్రస్తావించారు. అప్పటి మన్మోహన్ సింగ్ సదస్సుకి వెళ్లి కొత్త కొత్త ఫార్ములాలతో చరిత్ర సృష్టిస్తే.. ఇప్పుడు ప్రధాని కేవలం అంతర్జాతీయంగా మసకబారుతున్న తన ఇమేజ్‌ని కాపాడుకోవడానికేనని వెళ్లారని జైరాం రమేష్ అన్నారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'జీ7 సదస్సు 1970ల నుండి జరుగుతోంది. 1997-2014 మధ్య రష్యా కూడా సభ్య దేశంగా ఉంది. 2003 నుండి భారత్, చైనా, బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా దేశాలను జీ7 సమ్మిట్‌లకు ఆహ్వానిస్తున్నారు. 2007లో జరిగిన జీ7 సమ్మిట్‌లో ప్రపంచ వాతావరణ మార్పులపై అప్పటి భారత ప్రధాని మన్మోహన్‌సింగ్, జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ 'సింగ్- మెర్కెల్ ఫార్ములా'ను సమర్పించారు. ఈ ఫార్ములాను ప్రవేశపెట్టి వీరిద్దరూ చరిత్ర సృష్టించారు. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ విషయ పరిజ్ఞానంతో గ్లోబల్ సౌత్ వాణిని వినిపించే నేతగా ఎదిగారు. కానీ మోడీలా సొంత డబ్బా కొట్టుకోవడం ద్వారా కాదని మోడీని ఎద్దేవా చేశారు. కేవలం తన అంతర్జాతీయ ప్రతిష్టను మెరుగుపరుచుకుందుకు జీ7 సదస్సుకు వెళుతున్న మోడీ నుంచి ఈ ఘన చరిత్రను ఆయన అంగీకరిస్తాడాని ఆశించలేము.' అని రమేష్ తన పోస్టులో పేర్కొన్నారు.

కాగా, ప్రధాని నరేంద్రమోడీ వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. తాను ప్రధాని పదవి చేపట్టిన తర్వాత తొలి విదేశీ పర్యటనకు ఇటలీ వెళ్లారు. ఇటలీలో అపూలియాలో జీ7 సదస్సు జరగనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు మోడీ ఇటలీ వెళ్లారు.

# పాడేరు రోడ్డు ప్రమాదంపై ఎంపి సీఎం రమేష్ దిగ్భ్రాంతి

## క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు ఆదేశం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు మృతి చెందడం పట్ల అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మృతి చెందిన వారికి ప్రగాఢ సంతాపం ,వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసారు. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

కాగా, బుధవారం పాడేరులో జరిగిన మోదకొండమ్మ ఉత్సవాలకు అనకాపల్లి పార్లమెంట్ పరిధి అచ్యుతాపురానికి చెందిన ఎస్ఎస్వి సౌండ్సువారు స్టేజ్ లైటింగ్ , సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపు అనంతరం తిరుగు ప్రయాణంలో ఘాట్ రోడ్డులో వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ కు బ్రేక్స్ ఫెయిల్ అవడంతో ఒక్కసారిగా తిరగబడటంతో, దానిపై ప్రయాణిస్తున్న పార్లమెంట్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లైటింగ్ ,సౌండ్ సిస్టమ్ ఏర్పాటుకోసం పనిచేస్తున్న దినసరి కార్మికులు లోయలోకి పడిపోయి , వారిపై లైటింగ్, డెకొరేషన్ సామాన్లు పడిపోవడంతో, ముగ్గురు చనిపోగా, మరో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉండటం బాధాకరమని అన్నారు.బాధిత కుటుంబ సభ్యులకు తగిన ప్రభుత్వ సహాయం అందే విధంగా కృషి చేస్తానని సిఎం రమేష్ హామీ ఇచ్చారు.









VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.ravi kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారు మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.